Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 150 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 21 జూన్ 2023 | బుధవారం | పేజీలు : 4

### మానవ హక్కుల పరిస్థితిపై మాట్లాడేందుకు వెనకాడబోం..!

వాషింగ్టన్: ఉక్రెయిన్ సంక్షోభం వేళ అమెరికా పర్యటనకు వెళ్లిన విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్.. ప్రతి విషయంలోనూ భారత్ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. భారత్‌లో మానవహక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ అమెరికా చేసిన వ్యాఖ్యలకు సూటిగా బదులిచ్చారు. అమెరికాలో మానవహక్కుల పరిస్థితిపై తమ కు అభిప్రాయాలుంటాయని, చర్చ జరిగినప్పుడు వాటి గురించి మాట్లాడేందుకు వెనకాడబోమని తేల్చిచెప్పారు. వాషింగ్టన్‌లో భారత్, అమెరికాకు మధ్య 2ం2 స్థాయిలో చర్చలు జరిగాయి. ఈ సమయంలో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకన్ మాట్లాడుతూ.. భారత్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు పెర గడాన్ని గమనించామన్నారు. వీటికి ముగింపు పలికే వరకు ఈ అంశంపై నిరంతరం ఆ దేశంతో సంప్రదింపులు జరుపుతుంటామన్నారు.

# వదిలిన బాణమే.....

# జగనన్నకు ఎదురొస్తే..

## షర్మిల పార్టీ విలీనం వార్తలతో వైసీపీలో వణుకెందుకంటే..

వైఎస్ షర్మిల. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తుది శ్వాస వరకూ కరుడు కట్టిన కాంగ్రెస్ వాదిగా ఉన్న వైఎస్ రాజశేఖర రెడ్డి తనయురాలు. ఏపీ సీఎం జగన్ జైలులో ఉన్న సమయంలో అన్నకు అండగా నిలిచి.. 'మరో ప్రజా ప్రస్థానం' పేరుతో పాదయాత్ర చేసిన 'జగనన్న వదిలిన బాణం'. కాల క్రమేణా పరిస్థితులు మారాయి. రాజకీయ పరిణామాలు మారాయి. అన్నతో విభేదించి తెలంగాణలో వైఎస్సార్‌టీపీని స్థాపించిన వైఎస్ షర్మిల ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌కు ప్రస్తుతం ఆశా కిరణంలా కనిపిస్తోందా..? గతంలో జగనన్న వదిలిన ఇదే బాణాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పుడు జగన్ పైనే అస్త్రంగా సంధించబోతోందా..? రాబోయే ఎన్నికల్లో కాకపోయినా ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో అయినా అన్నాచెల్లెలి సవాల్ తప్పదా..? వైఎస్ రాజశేఖర రెడ్డి మాస్ ఇమేజ్‌తో రెండుసార్లు అధికారాన్ని దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ ఆయన కుమార్తె షర్మిలను ముందు నిలిపి ఏపీలో భవిష్యత్ రాజకీయం చేయడం తథ్యమా..? కర్ణాటక ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌తో రెండు తెలుగు రాష్ట్రాల్లో తిరిగి బలం పుంజుకునే లక్ష్యంతో కాంగ్రెస్ పావులు కదుపుతోందా..? వైఎస్ షర్మిల, కాంగ్రెస్ మైత్రీ బంధంపై.. కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్‌టీపీ విలీనం వార్తలపై ప్రత్యేక కథనం. వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీతో మైత్రి బంధాన్ని కొనసాగిస్తున్నారని దాదాపుగా తేలిపోయింది. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన అనంతరం అక్కడి కాంగ్రెస్ పార్టీ చీఫ్ డీకే శివకుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలపడం మొదలుకుని రాహుల్ గాంధీకి ట్విటర్ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలపడం వరకూ.. ఈ పరిణామాలు షర్మిల రాజకీయంగా ఎటు వైపునకు అడుగులు వేస్తున్నారోననే అనుమానాలకు తావిచ్చాయి. కాంగ్రెస్ పార్టీ కూడా షర్మిలతో మైత్రీ బంధానికి ఉవ్విళ్లూరుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఉన్న నిరాదరణే అందుకు కారణం.

ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి ఏపీలో పట్టుమని పది స్థానాలు గెలిచే పరిస్థితి ఉందని కూడా కచ్చితంగా చెప్పలేని దురవస్థలో ఏపీలో హస్తం పార్టీ ఉంది. ఈ పరిస్థితుల్లో వైఎస్ షర్మిల వైపు కాంగ్రెస్ పార్టీ ఆశగా ఎదురుచూస్తోందని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగే వైఎస్ షర్మిల రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం ఆసక్తికర చర్చకు అవకాశం ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే.. వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో షర్మిల విలీనం చేయనున్నారనే వార్తలు గుప్పుమన్నాయి. తాజాగా సోషల్ మీడియాలో మరో ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌టీపీ విలీనానికి తేదీ కూడా ఖరారైందని, జులై 8న ఇడుపులపాయకు సోనియా, రాహుల్ గాంధీ వెళ్తారని ప్రచారం జరుగుతోంది. అదే రోజు వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో వైఎస్ఆర్ సమాధి సాక్షిగా షర్మిల విలీనం చేయనున్నారనే ప్రచారం నెట్టింట ఊపందుకుంది. ఒకవేళ షర్మిల తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఆమె ఎలాంటి పాత్ర పోషించనున్నారనే ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది.

## తెలంగాణలో మరో కొత్త పార్టీ.. ఢిల్లీకి ఆ ఉద్యమ నేత

హైదరాబాద్ : తెలంగాణలో రాజకీయ పార్టీల కు కొదవ లేదు. అధికార బీఆర్ఎస్.. అధికార పార్టీ నుంచి అధికారాన్ని చేజిక్కించుకోవటం కోసం కాంగ్రెస్.. బీజేపీ లు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఈ మూడింటికి తోడు గా రాష్ట్రంలో ఉనికి లేనప్పటికి.. పాత వైభవంలో అంతో ఇంతో ప్రదర్శించాలన్న తపనలో టీడీపీ.. వీటికి తోడుగా కోదండరాం మాష్టారి టీజేఎస్.. మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో బీఎస్పీ.. షర్మిల టీవైసీపీ.. వీరు కాకుండా కమ్యునిస్టులు.. ఇలా తెలంగాణ మొత్తం రాజకీయపార్టీలతో కళకళలాడుతోంది. ఇప్పుడున్న పార్టీలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మరో కొత్త పార్టీని ఏర్పాటు చేసే దిశగా ప్రజాకవి గద్దర్.. తానో రాజకీయ పార్టీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఆయన ఢిల్లీలో ఉన్నారు. పొడుస్తున్న పొద్దుతో.. అంటూ తెలంగాణ లోని ప్రతి పల్లె లోనూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని రగిలించిన గద్దర్.. ఇప్పుడు గద్దర్ ప్రజా పార్టీ పేరుతో కొత్త దుకాణం పెట్టేందుకు రెఢీ అవుతున్నారు. గద్దర్ అలియాస్ విఠల్ రావు కొత్త పార్టీని ప్రకటించేందు కు వీలుగా తుది కసరత్తులో నిమగ్నమై ఉన్నారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం ఢిల్లీకి చేరుకోనున్నారు. ఈసీ అధికారుల్ని కలిసి కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ ప్రారంభించనున్నారు. గద్దర్ ప్రజాపార్టీ జెండా ను మూడు రంగులతో రూపొందించినట్లుగా చెబుతున్నారు. జెండా మధ్యలో పిడికిలిని పెట్టినట్లుగా చెబుతున్నారు. మూడురంగుల్లో ఎరుపు.. నీలి.. ఆకుపచ్చ రంగులు ఉన్నాయని చెబుతున్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో పెద్దపల్లి లోక్ సభ స్థానంనుంచి పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతున్న గద్దర్.. బీఆర్ఎస్ వైఫల్యాల పైనే ఎక్కువగా ఫోకస్ చేస్తారని చెబుతున్నారు. కేసీఆర్ సర్కారు గొప్పగా చెప్పుకుంటున్న సంక్షేమ పథకాల్లోని వైఫల్యాల్ని బట్టబయలు చేయటమే గద్దర్ లక్ష్యమని చెబుతున్నారు. మరేం జరుగుతుందో.. తెలంగాణ ప్రజానీకం ఎలా రియాక్టు అవుతుందో చూడాలి.

## బీజేపీలో మిస్టరీగా మారిన ఈటల మౌనం..

హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో సీనియర్ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మౌనం హాట్ టాపిక్‌గా మారింది. ఆయన కొద్ది రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పార్టీ కార్యాలయానికి కూడా రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొద్ది రోజుల క్రితం కుత్బుల్లాపూర్‌లో జరిగిన సంపర్క్ అభియాన్‌లో భాగంగా జరిగిన బహిరంగసభకు కూడా ఈటల దూరంగానే ఉన్నారు. గత 10 రోజుల క్రితం ఈటల రాజేందర్ అసోం సీఎం హిమంత బిశ్వశర్మను కలిసి వచ్చారు. అప్పటి నుంచి ఆయన మౌనంగా ఉంటున్నారు. ఇదే

క్రమంలో ఈటలకు బీజేపీ ఎన్నికల ప్రచారకమిటీ చైర్మన్ పదవిపై మీడియాలో లీకులు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈటలకు వ్యతిరేకంగా పలువురు సీనియర్లు సమావేశమై చర్చించడం కీలకంగా మారింది. అప్పటి నుంచి మీడియాకు దూరంగా ఉంటూ ఈటల మౌనం వహించడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్‌కు బీజేపీ బీ టీమ్ అంటూ కాంగ్రెస్ చేసిన ఆరోపణలపై కూడా ఈటల మౌనంగానే ఉన్నారు. మరోవైపు ఈటలతోపాటు మరోనేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా మౌనంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. ఈటల మౌనం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటనేది అటు పార్టీలో.. ఇటు అభిమానుల్లోనూ జోరుగా చర్చసాగుతోంది. ఇందుకుగల కారణాలపై ఆరా తీస్తున్నారు.

## హీటెక్కుతున్న వరంగల్ రాజకీయం..

### ఆ రెండు చెప్పాలంటూ ధర్మారెడ్డికి మురళీ సవాల్

వరంగల్: కాంగ్రెస్ నేత కొండా మురళీ-బీఆర్ఎస్ నేతల మధ్య డైలాగ్ వార్ ముదురుతోంది. ఇరు పార్టీల నేతలు మాటల దాడి పెంచేస్తున్నారు. నిన్నటి దాకా మాటకు మాట అనుకుంటే.. ఇప్పుడు సవాళ్ల వరకు వెళ్లింది. మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలకు మురళీ కౌంటర్ ఇస్తే.. ఆ తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కూడా ఘాటుగానే స్పందించారు. తాజాగా ధర్మారెడ్డి వ్యాఖ్యలకు కొండా మురళీ కూడా అదే స్థాయిలో కౌంటర్ ఎటాక్ చేస్తూ సవాల్ విసిరారు. కొండా మురళీ మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే... "ధర్మారెడ్డి.. డేటు.. టైము చెప్పు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తా!, ఎవరిని ఎవరు తరిమి కొడతారో తేల్చుకుందాం. పార్టీ అవకాశం ఇస్తే పరకాలలో పోటీ చేస్తా. ధర్మారెడ్డి నీ అంతు తేలుస్తా. బుల్లెట్లకు ఎదురొడ్డి నిలబడ్డ కొండా మురళీ ఎప్పటికీ భయపడబోడు. నంది పైపులు అమ్ముకునే బతికే ధర్మారెడ్డి నా గురించి మాట్లాడతావా?. మహిళా ఎంపీపీని అవమానించిన ధర్మారెడ్డిది కుసంస్కారం. ధర్మారెడ్డి మట్టి దొంగ. ధర్మారెడ్డి అరాచకాలు భరించలేక ఆయన కార్యకర్తలు నా దగ్గరకు వస్తున్నారు. మైసమ్మ సాక్షిగా పరకాలలో ధర్మారెడ్డిని ఓడిస్తా. భయపడటం అనేది మా వంశంలో లేదు. కేటీఆర్ చెబితే మీడియాతో మాట్లాడినావు. నేనేమైనా ఛత్తీస్‌గఢ్ గోండు బిడ్డనా.. నా భాష బాగోలేదట. నేను సన్నాసుల కాళ్లు మొక్క. చెంచాగిరి అనేది బీఆర్ఎస్ పార్టీలోనే పుట్టింది. నాకు రాజకీయ బిక్ష పెట్టింది రాజశేఖర్ రెడ్డి. అహంకారపు మాటలు మానుకోకపోతే నిన్ను తరిమికొడతాం. పరకాలలో ఉంటా.. వరంగల్ తూర్పులో ఉంటా.. దమ్ముంటే కాచుకోండి." అంటూ బీఆర్ఎస్ నేతలకు కొండా మురళీ సవాల్ విసిరారు. ఇక వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ కొవిడ్ సమయంలో చిన్న చిన్న దుకాణదారుల దగ్గర డబ్బులు వసూలు చేశారని మురళీ ఆరోపించారు.

# గులాబీ ఎమ్మెల్యేల కొత్త లెక్కలు

## కారులో ఉందామా? వెళ్లిపోదామా?

హైదరాబాద్ : టైమింగ్ విషయంలో పక్కాగా ఉండే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అందుకు భిన్నంగా వ్యవహరించారా? ఎన్నికలకు టైం దగ్గరకు వచ్చేసిన వేళ.. కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాల్ని తాజాగా నిర్వహించిన పార్టీ సర్వసభ్య సమావేశంలో ఓపెన్ గానే చెప్పేశారు. తోకలు కత్తిరిం చేస్తానంటూ ఎమ్మెల్యేలకు ఓపెన్ గా వార్నింగ్ ఇచ్చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆయన మాట్లాడిన మాటల తర్వాతే పలువురు ఎమ్మెల్యేల్లో కొత్త తరహా అంతర్మథనం మొదలైనట్లు చెబుతున్నారు. అందరి జాతకాలు తన దగ్గర ఉన్నాయని.. అవినీతి వద్దని చెప్పటమే కాదు.. మీ సిబ్బంది చేసే తప్పులకు సైతం మీరే బాధ్యత వహించాలంటూ సీఎం కేసీఆర్ నోటి నుంచి వచ్చిన మాటలకు పలువురు ఎమ్మెల్యేలు హర్ట్ అయినట్లుగా చెబుతున్నారు. తమ తప్పులకు శిక్ష విధిస్తానని చెబితే బాగుండేదని.. కానీ.. ఎవరో చేసిన తప్పులకు కూడా మీరే బాధ్యులు అన్నట్లుగా మాట్లాడటం సరికాదన్న ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తప్పులు చేసిన వారిని క్షమించనని.. టికెట్లు ఇచ్చే ప్రసక్తే లేదని కుండబద్ధలుకొట్టేసిన గులాబీ బాస్ మాటలతో పలువురు ఎమ్మెల్యేల్లో కొత్త ఆలోచనకు వస్తున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల వరకు వెయిట్ చేసి.. తీరా ఎన్నికల సమయంలో టికెట్లు ఇవ్వకపోతే తమ పరిస్థితి ఏమిటి? అన్నది ప్రశ్నగా మారింది. టికెట్ ఇవ్వకపోవటం అంటే.. తప్పులు చేసినవారిగా ముద్ర పడే ప్రమాదం ఉందని.. అందుకే టికెట్ లేదనిపించుకునే బదులు.. ముందే వెళ్లిపోతే ఎలా ఉంటుందన్న ఆలోచనలు కూడా షురూ అయినట్లు చెబుతున్నారు. పార్టీలో కొనసాగటమా? లేదంటే గులాబీ కారు దిగేసి.. నచ్చిన తోవలో ప్రయాణిస్తే మంచిదన్న యోచనలో గులాబీ నేతలు పలువురు వచ్చినట్లుగా చెబుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత నేపథ్యంలో.. సమీకరణాలు కుదరక.. ఎవరికైనా టికెట్లను రిజెక్టు చేస్తే.. తీవ్రమైన తప్పుడు పనుల కారణంగానే టికెట్లు ఇవ్వలేదన్నప్రచారం జరిగే ప్రమాదం ఉంది. అదే జరిగితే.. తమ రాజకీయ జీవితానికి ఫుల్ స్టాప్ పడినట్లుగాపలువురు నేతలు భయాందోళనలు చెందుతున్నారు. అందుకే.. కేసీఆర్ రిజెక్టు చేసే వరకు ఉండకుండా.. ముందేగానే పార్టీ నుంచి జంప్ అయిపోతే బాగుంటుందన్న మాట వినిపిస్తోంది. మరేం జరుగుతుందో చూడాలి.

# సంపాదకీయం

## తప్పుడు రామాయణాన్ని చూసేందుకు రూ.300 ఖర్చు చేయాలా?

ఒక డిస్ క్లైమర్ పడేసి.. ఒక మహా కావ్యాన్ని ఇష్టారాజ్యంగా తీసేస్తే.. లాగి పెట్టి రెండు ఇవ్వాల్సి ఉంటుంది. ఆదిపురుష్ మూవీ విడుదలైన రెండో రోజున.. సినిమాను చూసిన సినీ అభిమానులు తీవ్రమైన వేదనతో థియేటర్ లో నుంచి బయటకు వస్తున్నారు. తాము పుట్టినప్పటి నుంచి వింటూ వస్తున్న రామాయణాన్ని.. తమ పిల్లలకు చూపించాలన్న తపనతో ఆదిపురుష్ కు తీసుకెళితే.. ఉన్న నాలుగు ముక్కలు మర్చిపోయి.. అలా ఎందుకు చూపించారు? ఆ డైరెక్టర్ అంకుల్ కు రామాయణం గురించి తెలీదా? అన్న ప్రశ్నలు పలువురు పిల్లల నుంచి రావటం గమనార్హం. శ్రీరాముడిని.. రాఘవుడి పేరుతో చెప్పటం.. పాటల్లో తప్పించి.. శ్రీరామ్ అన్న మాటను ఒకట్రెండు సార్లు తప్పించి మరెక్కడా లేని రామాయణం.. పిల్లలే కాదు పెద్దలు సైతం జీర్ణించుకోలేక పోతున్నారు. రామాయణం అన్నంతనే రాముడు- సీత అన్న మాటలు చప్పున మనసులోకి వచ్చేస్తాయి. ఆదిపురుష్ లో రాముడ్ని రాఘవుడిగా.. సీతను జానకిలా ప్రస్తావించటం టెక్నికల్ గా తప్పు కాకపోవచ్చు. కానీ.. వారి ఒరిజినల్ పేర్లను ఒకట్రెండు సార్లకు పరిమితం చేయటం కంట్లో నలుసులా మారిందన్న మాట వినిపిస్తోంది. శూర్పణ ముక్కు చెవులు కోసేసిన తర్వాత.. మళ్లీ అతికిపోవటం.. శ్రీరాముడు తెల్లగా ఉండటం (నీలమేఘ శ్యాముడు).. సీతమ్మ భారతదేశ వాసిగా చెప్పటం.. దశ కంఠుడు రావణుడ్ని మాంత్రికుడిలా చూపించటం.. ఇలా చెప్పుకుంటూ పోతే.. రామాయణ మహాకావ్యాన్ని స్వేచ్ఛ పేరుతో నానా చెత్తను ఒక చోటుకు పేర్చి.. దానికి రూ.300-రూ.400 మధ్య టికెట్ ధరగా ఫిక్సు చేస్తే.. చూడాలా? అన్న మాటలు రెండో రోజు తర్వాత వినిపించటం ఎక్కువైంది. రామాయణ మహాకావ్యాన్ని ఈ తరానికి సైతం అర్థమయ్యేలా చెప్పే ప్రయత్నాన్ని అభినందించే క్రమంలో థియేటర్లకు వెళుతున్న ప్రేక్షకులకు.. సినిమా మొదలైన కాసేపటికే.. ఎలాంటి ఫీల్ లేకుండా.. గ్రాఫిక్స్ మాయాజాలంతో సినిమాను నెట్టుకురావాలన్న ప్లాన్ అడ్డంగా బెడిసి కొట్టిందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. స్వేచ్ఛ పేరుతో నానా చెత్తను పోగేసి.. దాన్ని క్రియేటివిటీగా చెబితే ఎందుకు ఆదరించాలి? ఇలాంటి ప్రయత్నాలతో మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతుందన్న మాట వినిపిస్తోంది. స్టోరీ బోర్డు మీద కూర్చున్నప్పుడు.. కోట్లాది మంది భావోద్వేగాలను సదరు దర్శక నిర్మాతలు ఎందుకు ఆలోచించనట్లు? అన్నది అసలు ప్రశ్న .

# అటవీశాఖలో అక్రమార్కులు

ఖమ్మం : పోడు సాగుదారుల నుంచి నగదు వసూలు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణానికి అనుమతులిచ్చి డబ్బు తీసుకోవడం, ధ్వజ స్తంభాలకు నారేప చెట్లు విక్రయించడంపై పలువురు అధికారులు, సిబ్బందిపై విజిలెన్సు అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విచారణలో అవినీతి జరిగినట్టు తేల్చారు. ఇవే ఆరోపణలపై ఇటీవల భద్రాద్రి జిల్లాలో ఓ రేంజర్, ఇద్దరు డీఆర్‌వోలు, ఓ బీట్ ఆఫీసర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. కూసుమంచి అటవీరేంజ్ పరిధిలోని నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో చెట్లు తొలగించేందుకు కాంట్రాక్టు దక్కించుకున్న గుత్తేదారును అటవీశాఖలోని కొందరు అధికారులు డబ్బు డిమాండ్ చేశారు. సదరు గుత్తేదారు చీఫ్ కన్జర్వేటర్‌కు ఫిర్యాదు చేయగా శాఖ పరమైన విచారణ జరిపి ముగ్గురిపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అటవీశాఖలో కొంతమంది అధికారులు, సిబ్బంది వ్యవహారం 'కంచే చేను మేసిన' చందంగా మారింది. అడవికి రక్షణ కవచంలా ఉండాల్సిన వాళ్లే అవినీతి ఊబిలో కూరుకుపోయి పర్యావరణానికి నష్టం కలిగిస్తున్నారు. మన్యంలో సాగుదారుల నుంచి డబ్బు దండుకుంటూ పోడు సాగుకు పరోక్షంగా సహకరిస్తున్నారు. ఏటికేడు పోడు భూముల సాగు విస్తీర్ణం పెరగడమే దీనికి కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మన్యంలో...ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొందరు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కాసుల కక్కుర్తి ఆ శాఖను అప్రతిష్టపాలు చేస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీశాఖలో అడుగడుగునా అవినీతి రాజ్యమేలుతోంది. కలప అక్రమ తరలింపు చాలా వరు ఆ శాఖలోని కొంతమంది కనుసన్నల్లోనే సాగుతోందన్న ఆరోపణలున్నాయి. అక్రమ కలప చెక్ పోస్టులు దాటేందుకు సహకరిస్తున్నారన్న వాదనలున్నాయి. దేవాలయాలకు ధ్వజ స్తంభాలకు అనుమతి ఇచ్చేందుకు రశీదులు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్క రశీదుతోనే మూడు, నాలుగు సార్లు కలప తరలిస్తూ కొంతమంది భారీగా సొమ్ము చేసుకొంటున్నారు. అటవీశాఖ నర్సరీల నిర్వహణలోనూ అక్రమాలు జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి.

పోడు భూముల్లో..ఉభయ జిల్లాల్లో పోడు భూముల సాగు విస్తీర్ణం పెరగడం వెనుక ఆ శాఖలోని కొందరి ప్రమేయం ఉందన్న వాదనలున్నాయి. పోడు సాగుదారుల నుంచి ఎకరాకు రూ.5-10 వేలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రత్యేకంగా విడుదలయ్యే కంపా నిధుల ఖర్చులోనూ కొందరు అధికారులు అవకతవకలకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. అటవీ పరిధిలోని వాగుల్లో ఇసుక రవాణా చేయడానికి అనుమతులు లేకున్నా అధికారుల అండదండలతో ఇసుక యథేచ్ఛగా తరలిపోతుంది. వ్యాపారులు, ట్రాక్టర్ల యజమానుల నుంచి ఒక్కో ట్రాక్టర్ నుంచి నెలకు ఆయా ప్రాంతాల్లో డిమాండ్‌కనుగుణంగా ముడుపులు ముట్టచెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అటవీశాఖలో అవినీతికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

శాఖకు మచ్చ తెస్తే ఊరుకోం

లక్ష్మణ రంజిత్ నాయక్, అటవీశాఖ జిల్లా అధికారి

వివిధ ఆరోపణలు, శాఖాపరమైన లక్ష్యాలు పూర్తి చేయని వారిపై ఈ ఏడాదిలో తొమ్మిది మందిపై సస్పెన్షన్ వేటు వేశాం. మరి కొందరికి మెమోలు జారీ చేశాం. శాఖకు మచ్చ తెచ్చే వారిని ఉపేక్షించేది లేదు. ఏ విధమైన ఆరోపణలు వచ్చినా విచారించి అవి నిజమైతే చర్యలు తీసుకుంటాం.

# మళ్లీ ముంపు ముప్పు

ఖమ్మం : గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చుతుండడంతో తీరప్రాంతంలోని జనం బెంబేలెత్తిపోతున్నారు. జులైలో వచ్చిన వరదలతో పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలం మండలాల్లో 77 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. 16 వేల కుటుంబాలకు పైగా ఇందులో తలదాచుకున్నాయి. రూ.130 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. ఆగస్టును తక్కువ అంచనా వేయొద్దు: కేంద్ర జల సంఘం నివేదికలతో పాటు రెవెన్యూ శాఖ చెబుతున్న వివరాలను పరిశీలిస్తే ఆగస్టులోనే ఎక్కువ సార్లు గరిష్ఠ వరదలు నమోదయ్యాయి. 1986లో ఆగస్టు 16న 75.6 అడుగులు రాగా ఇదే ఇక్కడ అత్యంత ప్రమాదకరమైన వరదగా రికార్డులకు ఎక్కింది. 1981 నుంచి ఇప్పటి వరకు పరిశీలిస్తే 10 సార్లు మూడో ప్రమాద హెచ్చరిక దాటింది. వర్షాకాలంలో ఒకసారి గరిష్ఠ వరద నమోదయ్యాక మళ్లీ వెంటనే వరద తీవ్రరూపం దాల్చడం చాలా అరుదుగా ఉంటుంది. వాతావరణంలోని మార్పుల వల్ల తీరప్రాంతంలో ఆగకుండా వర్షాలు కురుస్తుండడంతో మంగళవారం రాత్రి 8 గంటలకు 45.2 అడుగులకు చేరింది. కరకట్ట భద్రతపై యుద్ధ ప్రాతిపదికన దృష్టి సారించాలి. పలు చోట్ల రివిట్‌మెంట్ దెబ్బతినడంతో మరమ్మతు పనులు చేశారు. ఇంకొన్ని చోట్ల చిన్నచిన్న గోతులు ఉన్నాయి. పైభాగం పలు చోట్ల కుంగిపోయింది. సీసీ రహదారి రెండు భాగాలుగా విడిపోయినట్లు కనిపిస్తుంది. ఇసుక బస్తాలను ఉంచినప్పటికీ కొన్నింటిలో ఇసుక వర్షాల వల్ల కారిపోయింది.

తిరుగు జలాలను తోడేస్తున్న మోటార్లు: స్నానఘట్టాల్లోని విద్యుత్తు స్తంభాలు మునిగాయి. కల్యాణకట్ట కిందకు నీరు చేరింది. విస్తా కాంప్లెక్స్ వద్ద ప్రత్యేక మోటార్లతో తిరుగు జలాలను తోడేస్తున్నారు. ఇందు కోసం పెద్ద పైపులను కరకట్టపై ఏర్పాటు చేసి వ్యర్థ జలాన్ని నదిలో వదులుతున్నారు. ప్రస్తుతానికి ఇక్కడి లోతట్టు ప్రాంతాలకు ఇబ్బంది లేనప్పటికీ వరద పెరిగే తరుణంలో వర్షం వస్తే కష్టాలు తప్పవని భావిస్తున్నారు. వరుణుడు కరుణిస్తే సరే..లేదంటే లోతట్టు కాలనీవాసులు మరోసారి పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద రాకపోతే ఇబ్బంది తప్పినట్లేనని అంచనా వేస్తున్నారు.

నీట మునిగిన సీతమ్మ నారచీరలు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు మళ్లీ గోదావరి నది నీటిమట్టం పెరిగింది. దుమ్ముగూడెం, పర్ణశాల వద్ద గోదావరి నది నీటి మట్టం మంగళవారం నాటికి దాదాపు 21.60 అడుగులకు చేరుకుంది. పర్ణశాల వద్ద స్నానఘట్టాలను నీట ముంచింది. సీతమ్మ నార చీరల ప్రదేశం, స్వామివారి సింహాసనం నీట మునగడంతో పాటు వ్యాపార దుకాణాలు సగం వరకు మునిగిపోయాయి. వివిధ వ్యాపారులు అక్కడ నుంచి దుకాణాలను ఖాళీ చేశారు. డొంకవాగు పొంగడంతో సున్నంబట్టి-బైరాగులపాడు గ్రామాల మధ్య ప్రధాన రహదారి మునిగి స్థానికులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

పరీవాహకంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

ఎగువనున్న ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుంచి వస్తున్న వరద నీటితో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతున్నందున పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. రాత్రికి నీటిమట్టం 55 అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నందన అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నందున పశువులు, మేకలు, గొర్రెలను వాగులు దాటకుండా చూసుకోవాలని సూచించారు. చేపల వేట కోసం జాలర్లు గోదావరి నదిలోకి వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. సహాయక చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలని, గజ ఈతగాళ్లను, బోట్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

# అరకొర వసతులు.. అంతంతే సేవలు

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)ల్లో సిబ్బంది కొరత, వసతుల లేమి వేధిస్తోంది. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ప్రబలుతున్న తరుణంలో నిత్యం వందల మంది ఆసుపత్రులకు వస్తున్నారు. సరిపడా సిబ్బంది, వైద్యులు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. వైద్య నిపుణులు లేకపోవడంతో ఉన్న సిబ్బంది మందు గోళీలు ఇచ్చి పంపిస్తున్నారు. రక్త, మూత్ర పరీక్షలకు ప్రైవేటును ఆశ్రయించడంతో పేద ప్రజల జేబులు గుల్ల అవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని మండలాల్లో పీహెచ్‌సీలను బృందం పరిశీలించింది. ఆ వివరాలు..

భర్తీకాని వైద్య సిబ్బంది పోస్టులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ఖాళీలతో పూర్తి స్థాయిలో సేవలందక రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలకు కేవలం సారంగాపూర్ పీహెచ్‌సీ మాత్రమే ఉండగా ఆయా మండలాల రోగులు ఇక్కడికే రావాల్సి వస్తుంది. ఇద్దరు వైద్యులకు ఒక్కరు, సీహెచ్‌వో, పర్యవేక్షకుడి పోస్టు, నలుగురు స్టాఫ్ నర్సులకు కేవలం ఒక్కరే, అయిదుగురు హెల్త్ అసిస్టెంట్లకు నాలుగు ఖాళీ ఉన్నాయి. డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టు ఖాళీ ఉండడంతో హెల్త్ అసిస్టెంట్ చూసుకోవాల్సి వస్తుంది. గదులు పూర్తి స్థాయిలో సరిపోకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చిన సామగ్రి వరండాలో ఉంచి వినియోగించుకోవాల్సి వస్తుంది.

# నిధులు వస్తేనే... రహదారుల బాగు

జగిత్యాల : జగిత్యాల జిల్లాలో గత మూడేళ్లుగా కురుస్తున్న భారీ వర్షాలతోపాటు ఈ ఏడాది కురిసిన వర్షాలతో రహదారులు దెబ్బతిన్నాయి. జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతు కోసం తక్షణం రూ.100 కోట్లు కావాలని రెండు శాఖలు ప్రభుత్వానికి నివేదించాయి. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే రహదారులు బాగయ్యే అవకాశం ఉంది. జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీతోపాటు జాతీయ రహదారులు విస్తరించి ఉన్నాయి. గత మూడేళ్లుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీశాఖ రహదారులే అధికంగా దెబ్బతిన్నాయి. గతంలో దెబ్బతిన్న రహదారులకు తోడు గత నెల నుంచి కురుస్తున్న వర్షాలకు దారులు అధ్వానంగా మారాయి. పంచాయతీరాజ్‌శాఖ 973 కిలోమీటర్ల రహదారులు దెబ్బతినగా అందుకు రూ.39.20 కోట్ల నిధులు కావాల్సి ఉంది. ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన రహదారులు 3852 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. వీటి మరమ్మతు కోసం రూ.59.47 కోట్ల నిధులు అవసరం.

లోలెవల్ వంతెనల వద్ద ఇక్కట్లు

జిల్లాలో రహదారులు అధ్వానంగా మారగా లోలెవల్ వంతెనలతో సైతం ప్రజలకు ఇబ్బందులు తప్పటంలేదు. చిన్నపాటి వర్షం వస్తే వంతెనలపై వరద ఉప్పొంగటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. అనంతారం వంతెన, ధర్మపురి మండలం నేరెళ్ల వద్ద వంతెన నిర్మాణాలు లేక భారీ వర్షాలతో లోలెవల్ వంతెనలు మునిగిపోయి రెండుమూడు రోజులు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆయా నిర్మాణాలకు నిధులు కేటాయించకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో 35కు పైగా లోలెవల్ వంతెనలు ఉండగా వాటికి వెంటనే నిధులు మంజూరు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## రుణమాఫీ నిధులు అందేనా..!

జగిత్యాల : పంటరుణమాఫీ నిధుల కోసం అన్నదాతలు పడిగాపులు పడుతున్నారు. ఒక్కో రైతుకు రూ.లక్ష వరకు పంట రుణాన్ని మాఫీచేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ప్రకటించగా పూర్తిస్థాయి నిధుల విడుదలపై ఇప్పటికీ స్పష్టతలేక కర్షకులు కలవరపడుతున్నారు. ప్రభుత్వ హామీ మేరకు 2018 డిసెంబరు 11వ తేదీకంటే ముందు తీసుకున్న రూ.లక్షలోపు రుణాలకు మాఫీ వర్తిస్తుందని కటాఫ్ తేదీని ప్రకటించారు. ఈ క్రమంలో జిల్లాలో మొత్తం 1.03 లక్షల మంది రైతులకు రూ.711.62 కోట్ల పంటరుణ మాఫీ నిధులు అందించాల్సి ఉంటుందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు రెండేళ్లక్రితం రూ.25 వేలవరకు పంటరుణం గల 9,328 మంది రైతులకు రూ.13.81 కోట్ల మాఫీ నిధులను విడుదల చేశారు. రూ.25 వేలనుంచి రూ.50 వేల వరకు పంటరుణ మాఫీ మొత్తాన్ని 2021 ఆగస్టు నెలాఖరులోగా రైతుల ఖాతాలకు జమచేస్తామని ప్రభుత్వం ప్రకటించినా కొన్ని రోజులపాటు మాత్రమే రూ.33 వేల వరకు రుణమున్న కొందరికే నిధులను బదిలీచేశారు. 2022 ఆగస్టు వచ్చినా కనీసం రూ.50 వేల వరకుకూడా మాఫీ నిధులను విడుదల చేయకపోవటంతో ఇక నిధులు ఇస్తారా ఇవ్వారా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2022 మార్చి నెలలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో

పంటరుణ మాఫీకిగాను రూ.16,144 కోట్లను కేటాయించి మార్చి నెలాఖరులోపు రూ.50 వేల వరకుగల రుణాలకు నిధులను విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో జిల్లాలో రూ.50 వేల వరకు పంటరుణం గల 16,796 మందికి రూ. 58.88 కోట్ల నిధులు రావాల్సిఉండగా ఇప్పటికీ నిధులను విడుదల చేయటంలేదు. రూ.50వేల నుంచి రూ.75వేల వరకు రుణమున్న రైతులకు ప్రస్తుత 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిధులను విడుదల చేసి రూ.75 వేల నుంచి రూ.1 లక్ష వరకు గల రైతులకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిధులను అందిస్తామని ప్రభుత్వం పేర్కొన్నా ఎంతమంది రైతులకు పంట రుణమాఫీ నిధులందుతాయనేది సందేహంగా మారింది. రాష్ట్రప్రభుత్వం 2014లో తొలిసారి రూ.ఒక లక్ష వరకు పంటరుణాన్ని మాఫీ చేసినపుడు నిధులను నేరుగా రైతుల ఎస్‌బీ ఖాతాలకు విడుదల చేశారు. ఈ మొత్తాన్ని ఏడాదికి పావుశాతం చొప్పున నాలుగేళ్లలో నాలుగు దఫాలుగా రైతులకు అందించారు. కాగా ప్రస్తుతం మాఫీ నిధులను రైతుల ఎస్‌బీ ఖాతాలకు కాకుండా నేరుగా పంటరుణ ఖాతాకే బదిలీచేయటం పెద్దసమస్యగా మారింది. కొన్ని బ్యాంకుల విలీనం, రైతుల రుణఖాతా నెంబరు మారటం, బంగారం కుదువపెట్టి తీసుకున్న సాగురుణ ఖాతాలను మూసేయటం, బ్యాంకులు మారటం తదితర కారణాలతో వేలాదిమంది నిధులందే అవకాశాన్ని కోల్పోయారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా పొదుపు ఖాతాలకు నిధులను విడుదల చేయాలని, ప్రభుత్వ ఏర్పడి నాలుగో సంవత్సరంనకు చేరినందున రూ.లక్ష వరకు పంటరుణాన్ని ఒకేదఫాలో మాఫీచేయాలని రైతులు కోరుతున్నారు.

వివరాలు గతంలోనే సమర్పించాం- పాక సురేశ్‌కుమార్, వ్యవసాయాధికారి, జగిత్యాల జిల్లా

జిల్లాలో రుణమాఫీకి అర్హులైన రైతుల జాబితాను గతంలోనే ప్రభుత్వానికి సమర్పించాము. దాదాపుగా రూ.33 వేల వరకు పంటరుణం గలవారికి నిధులందాయి. నిధులు చేరిన రైతుల జాబితాలు సైతం ప్రభుత్వం వద్దే ఉన్నాయి.

# క్షేత్ర సహాయకులు లేక.. ఉపాధి నత్తనడక

జనగామ : గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలను నివారించి వారికి పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో క్షేత్ర సహాయకులను నియమించకపోవడం, గతంలో సస్పెండ్ అయిన క్షేత్ర సహాయకుల స్థానాల్లో కొత్తవారిని నియమించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. జఫర్‌గఢ్ మండలంలో 21 పంచాయతీల్లో ఏబీతండా(శంకర్‌తండా), దుర్గ్యానాయక్‌తండా, లక్ష్మీనాయక్‌తండా, ముగ్దుంతండా కొత్తగా పంచాయతీలుగా ఏర్పడ్డాయి. ఈ గ్రామాల్లో క్షేత్ర సహాయకులు లేరు. అదేవిధంగా ఉప్పుగల్లు, తమ్మడపల్లి(ఐ)లో ఇంతకు ముందు పనిచేసిన క్షేత్ర సహాయకులను వివిధ కారణాలతో ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఏడాది దాటినా వీరి స్థానంలో మరొకరిని నియమించలేదు. తాము పని చేసినా నెలల తరబడి వేతనాలు రావడంలేదని కూలీలు ఆవేదన

వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 21 పంచాయతీల్లో 9,839 జాబ్ కార్డులు ఉన్నాయి. కూలీల సంఖ్య 20,180.. మండల వ్యాప్తంగా 50 శాతం మంది కూలీలు మాత్రమే పనులకు వస్తున్నారు. ఉప్పుగల్లు, తమ్మడపల్లి(ఐ)లో గతంలో కూలీలకు ఎక్కువగా పనులు చేసేవారు. క్షేత్ర సహాయకులు సస్పెండ్ కావడంతో మేట్లతో పని చేయించడంతో వారు సరిగా పనులు చూపడం లేదని కూలీలు చెబుతున్నారు. పనుల కల్పన, పర్యవేక్షణ, కొలతల నిర్వహణ, ఆన్‌లైన్‌లో కూలీల వివరాల నమోదు, కూలీలకు బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నూతన గ్రామ పంచాయతీలకు క్షేత్ర సహాయకులను నియమించాలని కూలీలు కోరుతున్నారు.

ఇబ్బందులున్న మాట వాస్తవమే..

– రాజకరుణ, ఏపీవో

కొత్త పంచాయతీల్లో క్షేత్ర సహాయకులు లేని మాట వాస్తవం.. ప్రస్తుతం ఉన్న వారితోనే పనులు చేయిస్తున్నాం. కూలీలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి గ్రామం నుంచి వంద నుంచి 200 వరకు కూలీలు పనులు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో తపాలా కార్యాలయంలో చెల్లింపుల్లో కొంత జాప్యం జరగడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు

# అంతా అసంపూర్తిగానే..

కరీంనగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతోపాటు తరగతి గదుల మరమ్మతు చేపట్టడానికి ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' పథకాన్ని ప్రారంభించింది. పథకం ప్రారంభించి దాదాపు ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు ఆయా పాఠశాలల్లో సగం పనులు కూడా పూర్తి కాలేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడి పనుల్లో జాప్యం, నాణ్యత లోపం కనిపిస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని 274 ప్రభుత్వ పాఠశాలల్లో మనఊరు–మనబడి కార్యక్రమం కింద తరగతి గదుల్లో విద్యుదీకరణ పనులు, పాఠశాల ఆవరణలో డైనింగు హాళ్లు, వంట గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతితోపాటు చిన్న చిన్న మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. అయినప్పటికీ పలు గ్రామాల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లు, సర్పంచులు ఆయా పనులు చేపట్టడానికి ఆసక్తి చూపడంలేదు. కొన్ని గ్రామాల్లో సర్పంచులు వివిధ పనులను తమ అనుచరులకు అప్పగించినా వాటిని సకాలంలో పూర్తి చేయడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.2.61 కోట్ల పనులకు రూ.26.90 లక్షల చెల్లింపులు

మల్యాల మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు–మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులకు ప్రభుత్వం రూ.2,61,88,381 మంజూరు చేయగా ఇప్పటి వరకు ఆయా పాఠశాలల్లో జరిగిన పనులకు సంబంధించి అధికారులు రూ.26,90,974 మాత్రమే చెల్లించారు. మండలంలోని రామన్నపేట గ్రామంలోని పాఠశాలల్లో మాత్రమే అన్ని పనులు పూర్తికాగా, 7 జడ్పీ ఉన్నత పాఠశాలలకు(ఒక్కో పాఠశాలకు మూడు చొప్పున) ప్రభుత్వం 24 డిజిటల్ బోర్డులను పంపిణీ చేసింది. ఒక్కో డిజిటల్ బోర్డు ఖరీదు రూ.5 లక్షలు ఉంటుందని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. మండలం

లోని తాటిపల్లి పాఠశాలలో ఇప్పటి వరకు ఏ ఒక్క పని కూడా పూర్తి కాలేదు. బల్వంతాపూర్‌లో డైనింగ్ హాలు, మరుగుదొడ్లకు నీటి వసతి, పైపులైను నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మల్యాలలోని బాలికల ఉన్నత పాఠశాలకు ప్రహరీ మంజూరైనా పనుల జాడేలేదు. తక్కళ్లపల్లిలో వంటగది, మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు నీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. మద్దుట్లలో కూడా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని మండల విద్యాధికారి తెలిపారు. మ్యాడంపల్లిలోని పాఠశాలలో చేపట్టిన పనులన్నీ అర్ధంతరంగానే నిలిచిపోయాయి. పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక చొరవచూపించాల్సి ఉంటుందని మండల విద్యాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. 15 శాతం రివాల్వింగ్ ఫండ్ కేటాయించినా..

ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మన ఊరు–మన బడి కార్యక్రమం కింద మంజూరైన ఆయా పనులు చేపట్టడానికి ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లకు 15 శాతం రివాల్వింగ్ ఫండ్ కేటాయించింది. చేపట్టిన పనికి ముందుగానే దాని అంచనాలో 15 శాతం బిల్లును చెల్లించే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో సాధారణంగా పేద కుటుంబాలకు చెందిన పిల్లలే చదువుతారు. ఎస్ఎంసీ కమిటీలోని పేరెంట్స్ కూడా ఆర్థికంగా వెనుకబడిన వారే ఉంటారు. అందువల్ల కమిటీ ఛైర్మన్ ఆర్థిక పరిస్థితుల కారణంగా ముందుగా పెట్టుబడి పెట్టి ఆయా పనులను చేపట్టడానికి ముందుకు రాక పనుల్లో జాప్యం జరుగుతోందని మండల విద్యాధికారులు పేర్కొంటున్నారు. సర్పంచులు మాత్రం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన కొన్ని పనులను చేయిస్తున్నారు. అవి కూడా అసంపూర్తిగా కనిపిస్తున్నాయి.

# అమృత్ సరోవర్‌తో జల సంరక్షణ

కరీంనగర్ : గ్రామాల్లో రోజురోజుకు సాగు విస్తీర్ణం పెరగడంతోపాటు నీటి వినియోగం కూడా విపరీతంగా పెరిగిపోయింది. దీంతో భూగర్భ జలాలు పడిపోయి నీటి ఎద్దడి ఏర్పడుతుంది. ఏటా వర్షాకాలంలో వర్షం నీరు వృథాగా పోయి గోదావరిలో కలుస్తుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాల పెంపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి జల సంరక్షణకు చర్యలు చేపట్టాయి. కుంటల నిర్మాణాలు, పాత కుంటల మరమ్మతు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'అమృత్ సరోవర్' పథకాన్ని తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ, ఉపాధి హామీ పథకంలో సమతుల కందకాలు, అటవీశాఖ ద్వారా మినీ పర్క్‌లేషన్ ట్యాంకులు, రాతి కట్టడాలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపడుతోంది. అయినప్పటికీ పూర్తి స్థాయిలో పునరుద్ధరణ కాకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి మండలంలో నూతన, పాత కుంటలకు మరమ్మతులు చేపట్టి నీటిని నిలువ చేసేందుకు చర్యలు చేపట్టింది. గతేడాది పథకాన్ని ప్రారంభించగా వచ్చే ఆగస్టు 15లోపు నిర్మాణాలు పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. దీనికి అనుగుణంగా అధికారులు ప్రణాళిక తయారు చేసి పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నారు.

పనుల పూర్తికి చర్యలు

లక్ష్మీనారాయణ, డీఆర్డీవో

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అమృత్ సరోవర్ పథకం ద్వారా కుంటల మరమ్మతులు చేపట్టడంతో భూగర్భజలాలు పెరగనున్నాయి. దీని ద్వారా సమీప రైతుల వ్యవసాయ బావులలో నీటి మట్టం పెరగడమే కాకుండా పశువులు, వన్యప్రాణుల దాహార్తి తీరనుంది. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టడంతో కూలీలకు ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పనులు కొనసాగుతున్నాయి. ఎంపిక చేసిన పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం.

పెరగనున్న భూగర్భ జలాలు

ప్రతి జిల్లాలో కనీసం 75 కుంటలను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. జగిత్యాల జిల్లాలోని 18 మండలాల్లో 162 కుంటలను పథకం కిందతీసుకోగా ఇందులో 95 పనులు ప్రగతిలో, మిగతా 51 పనులు పూర్తి చేశారు. ఇందులో కొత్త కుంటల నిర్మాణాలతోపాటు పాత కుంటల పునరుద్ధరణ, పూడికతీత పనులు చేపట్టనున్నారు. ఒక్కో పనికి అవసరం మేర రూ.లక్ష నుంచి రూ.10లక్షల లోపు వ్యయం చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. కుంటల మరమ్మతులతో భూగర్భజలాలు పెంచడమే కాకుండా తాగు, సాగునీటి సౌకర్యం కల్పించే లక్ష్యంతో చెరువులు అభివృద్ధి చేయడానికి పథకం తీసుకువచ్చింది. పనుల్లో భాగంగా ఉపాధికూలీలకు పనిదినాలు కల్పించడమే కాకుండా చెరువు అడుగు భాగంలో 10 వేల ఘనపుటడుగుల మేర నీటిని నిలవ ఉండేలా కొలతలు ఇచ్చి ఆమేరకు పూడిక(ఒండ్రు) మట్టిని తీయనున్నారు. ఒండ్రు మట్టిని పొలాలకు తరలించేందుకు, చెరువు కట్ట పటిష్ఠానికి ఉపయోగిస్తున్నారు. పనులు పూర్తి చేసుకుంటే వానాకాలంలో కురిసే వర్షాలకు చెరువులు, కుంటలు నిండి జలకళ సంతరించుకోవడం, సమీప రైతుల వ్యవసాయ బావులలో నీటి మట్టం పెరగడమే కాకుండా పశువులు, వన్యప్రాణుల దాహార్తి తీరనుంది. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టడంతో కూలీలకు ఉపాధి లభించనునుంది.

# రైతు వేదికల నిర్వహణకు నిధులేవీ?

కరీంనగర్ : రైతులు నిరంతరంగా సమావేశాలు నిర్వహించుకొని పంటల సాగు, వ్యవసాయంలో కొత్త విధానాలు, అధికారుల సూచనలు తెలుసుకునేందుకు వీలుగా అన్ని జిల్లాలో రైతు వేదికలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ క్లస్టర్ల వారీగా వీటిని నిర్మించింది. వ్యవసాయశాఖతోపాటు అనుబంధ విభాగాలు, ఇతర శాఖలకు సంబంధించి అవసరమైన సమావేశాలు అప్పుడప్పుడు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ అధికారితోపాటు రైతు సమితి అధ్యక్షుడి భాగస్వామ్యంతో కార్యక్రమాలు చేపడుతున్నారు. కొన్ని గ్రామానికి దూరంగా, కొన్ని దగ్గరగా నిర్మించారు. కార్యాలయాలు ఏర్పాటు చేసింది. కానీ వాటి నిర్వహణకు నిధులు కేటాయించడంలేదు.

ఏఈవోలకు కష్టాలు

రైతు వేదికల నిర్వహణకు ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయకపోవడంతో ఏఈవోలు ఇబ్బంది పడుతున్నారు. కరీంనగర్ జిల్లాలో ఒక రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ నామినెట్ చేసిన ప్రజాప్రతినిధి వేదిక నిర్వహణ తీరుపై సంబంధిత ఏఈవోపై తీవ్రంగా మండిపడ్డారు. కొందరు సొంత డబ్బులు నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ మొత్తాన్ని కేటాయిస్తే సర్దుబాటు చేసుకుంటామన్నా అవస్థలు తప్పడం లేదు. బిల్లులు చెల్లించకపోవడంతో సదరు అధికారులు కూడా ఒత్తిడి తెస్తుండటంతో జిల్లా స్థాయి అధికారులు పరిస్థితిని విద్యుత్తు ఉన్నతాధికారులకు వివరించి సమయం తీసుకున్నట్లుగా తెలిసింది. ప్రభుత్వం వానాకాలం పంట సీజన్ దృష్టిలో పెట్టుకొని నిధులు విడుదల చేయాల్సిన అవసరముంది. ఈ రైతు వేదిక నిర్వహణ నిధులపై ప్రభుత్వానికి నివేదించామని, విడుదల కాగానే కేటాయిస్తామని ఓ జిల్లా స్థాయి వ్యవసాయ అధికారి ఒకరు తెలిపారు.

శిక్షణ కార్యక్రమాలు–సమావేశాలు

వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులకు అందుబాటులో ఉండేందుకు వీలుగా వేదికలో వసతి కల్పించారు. ప్రత్యేకంగా ఫర్నిచర్ కూడా సమకూర్చారు. శిక్షణ కార్యక్రమాలకు అవసరమైన కుర్చీలు, మైకు వంటివి ఏర్పాటు చేశారు. సీజన్ల వారీగా పంటల సాగుపై అవసరమైన వారికి సలహాలు, సూచనలు ఇస్తుంటారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వ్యవసాయ, రైతు సమావేశాలు నిర్వహించారు. వీటిని ఇతర శాఖలు కూడా వినియోగించుకుంటున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే గ్రామాల్లో మినీ వేడుక మందిరంగా కూడా ఉపయోగపడుతుంది.

తొమ్మిది నెలలుగా..

ఉమ్మడి జిల్లాలో 258 రైతు వేదికలు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన నిధులకు తోడు కొన్ని చోట్ల రైతుల తోడ్పాటుతో మరిన్ని సౌకర్యాలు కల్పించారు. వీటి నిర్వహణకు ప్రతి నెల రూ.9 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలలకు రూ.45 వేలు నిధులు విడుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటివరకు నయాపైసా రాకపోగా తొమ్మిది నెలల నుంచి అధికారులు నానావస్థ పడుతున్నారు.

# భవనం ఒకటి.. పాఠశాలలు రెండు!

కరీంనగర్ : భవనం ఒకటి.. అందులో రెండు గదులు.. వాటిల్లో కొనసాగుతున్నవి రెండు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ బడులు ఎక్కడో మారుమూల గ్రామీణ ప్రాంతంలో కాదు. జిల్లా కేంద్రమైన కరీంనగర్‌లో కమాన్–కోతిరాంపూర్ రోడ్డులో రెండు గదులతో కూడిన భవనంలో బోయవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కొన్నేళ్లుగా ఉంది. ఇందులో 1–5 తరగతులకు ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. సిక్‌వాడిగా సమీపంలో గురుద్వార ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఓ అద్దె షెడ్లలో కొన్నేళ్లుగా నడుస్తోంది. ఇందులో 1–5 తరగతుల్లో 37 మంది బాలలుండగా, ఇద్దరు టీచర్లు ఉన్నారు. షెడ్డు యజమాని ఆ పాఠశాలను ఖాళీ చేయాలని చెప్పడంతో ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లడంతో బోయవాడ ప్రాథమిక పాఠశాలలోని ఓ గదిని ఈ బడి కోసం కేటాయించారు. ప్రస్తుతం ఒకే భవనంలోని రెండు గదుల్లో రెండు పాఠశాలలు వేర్వేరుగా కొనసాగుతున్నాయి. గతంలో రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియలో ఇలా ఒకే ఆవరణలో రెండు ఒకే రకమైన పాఠశాలలు ఉండవద్దనే నిబంధనను పెట్టి ఇలా ఉన్న వాటిని ఒకే పాఠశాలగా విలీనం చేశారు. ఇప్పుడు ఒకే భవనంలో రెండు సర్కారు బడులు కొనసాగుతుండటం విమర్శలకు తావిస్తోంది.

పెరిగిన దూరాభారం..గురుద్వార పాఠశాల ఇప్పుడు దూరభారం కావడంతో తల్లిదండ్రులు పలువురు బాలలను తరగతులకు పంపిం

చడం లేదు. ఒక్కో పాఠశాలలో 5 తరగతులకు ఒకే గది ఉండటంతో బోధనకు ప్రతిబంధకాలతోపాటు కొత్తగా ప్రవేశాలు జరగడం లేదు. పిల్లల ప్రవేశాలకు ఇక్కడకు వస్తున్న తల్లిదండ్రులు ఒకే భవనంలో ఈ రెండు పాఠశాలలు ఏమిటి? ఏ బడిలో ప్రవేశం కల్పించాలనే విషయంలో సందిగ్ధంలో ఉంటున్నారు. ఈ కారణంగా వీటిల్లోని ఏదో ఒక పాఠశాల మనుగడకు ప్రమాదం ఏర్పడే అవకాశముంది. మన ఊరు–మనబడి కార్యక్రమం కింద కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దుతుండగా, నగరంలోని ఈపాఠశాలకు కనీసం పక్కా భవనం లేకపోవడం గమనార్హం. జిల్లా విద్యాశాఖ ఈవిషయంలో స్పందించి భవనాన్ని నిర్మించేలా చొరవ చూపడంతోపాటు అప్పటి వరకు తాత్కాలికంగా అద్దె భవనాన్ని సమకూర్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# డబుల్ ఇళ్లకు తాళాలు!

పెద్దపల్లి : ఇళ్లు నిర్మించారు.. రంగులు వేశారు.. అక్కడక్కడ కొన్ని అసౌకర్యాలు తప్ప పేదవారు నివసించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్న రెండు పడక గదులను ప్రభుత్వం వారికి అప్పగించడం లేదు. దరఖాస్తులు స్వీకరించారు.. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల పరిస్థితులు చూశారు. గతంలో ఎంపికైన లబ్ధిదారులను పరిగణనలోకి తీసుకోకుండానే మరోసారి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులు ఎక్కువ మంది ఉండటంతో లక్కీ డ్రా తీసి లబ్ధిదారులను ప్రకటించారు. ఇందులోనూ పలు ఫిర్యాదులు, అభ్యంతరాలు రావడంతో మరోసారి రీ–సర్వే నిర్వహించి లబ్ధిదారులను తొలగించారు. ఈ ప్రక్రియకు రెండు నెలలు దాటింది. ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. మంథని మినహా రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో నిర్మించి పేదలకు పంపిణీ చేసిన రెండు పడక గదుల నిర్మాణాలు ఇంకా అర్హుల చేతికి అందకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పంపిణీపై దాటవేత

ఏళ్ల తరబడి కట్టడం, తలుపులు, కిటికీలు ఊడిపోవడం, నీటి ట్యాంకులకు చిల్లులు పడటం, విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారాయి. రామగుండం, పెద్దపల్లి ప్రాంతాల్లో ఇప్పటికే నిర్మించిన ఈ గృహసముదాయాల్లో సరైన మురుగునీటి వ్యవస్థ సరఫరా, తాగునీటి పైపులైన్లు, రహదారుల వ్యవస్థలు సక్రమంగా లేవు. వర్షాకాలంలో భారీ వానలు కురిస్తే ఈ సముదాయాలన్నీ మునిగిపోతున్నాయి. గుత్తేదారులు కొందరు



చేతులెత్తేయడం, నాణ్యతతో నిర్మించకపోవడంతో గృహప్రవేశానికి ముందే పలు ఇళ్ల సముదాయాల్లోని గదులకు పగుళ్లు వచ్చాయి.

ఇదీ పరిస్థితి

మంథనిలోని పోచమ్మవాడలో 92 ఇళ్లు నిర్మించగా 74 మందిని అర్హులుగా తేల్చారు. 18 మందిని అనర్హులుగా తేల్చారు. కూచిరాజ్‌పల్లిలో ఇంకా పనులు కొన్నిఅసంపూర్తిగా ఉన్నాయి. మార్చి 15న పెద్దపల్లి పట్టణంలోని చందాపల్లి, కూనారం రోడ్డు ప్రాంతాల్లో నిర్మించిన 484 రెండు పడకల గదుల ఇళ్లకు రిజర్వేషన్ల ప్రాతిపదికన అర్హుల ఎంపిక చేశారు. ఎస్సీలకు 17 శాతం చొప్పున 81 మంది, మైనార్టీలకు 12 శాతం చొప్పున 55 మందికి, ఎస్టీలకు 6శాతం చొప్పున 10 ఇళ్లు, దివ్యాంగులకు ప్రతీభాగంలో 5 శాతం చొప్పున 17, ఓపెన్ కేటగిరి కింద 321 ఇళ్లు కేటాయించారు. నివాసయోగ్యానికి కావాల్సిన ప్రొసీడింగ్ కాపీలు ఇవ్వలేదు.

మార్చి 16న రామగుండంలోని ఫైవింక్లయిన్ ఏరియా, మాల్కాపూర్ శివారులో నిర్మించిన 660 ఇళ్లకు రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీ, దివ్యాంగులకు 112, ఎస్టీలకు 40, మైనార్టీలకు 79, జనరల్ కేటగిరిలో 429 గృహాలకు డ్రా తీశారు. ఎవరికి హక్కుపత్రాలు, ఇళ్ల తాళాలు ఇవ్వలేదు.

అసంపూర్తి పనులతోనే ఆలస్యం

గుత్తేదారులు మంథని మినహా రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల్లో నిర్లక్ష్యంగా పనులు చేశారు. మురుగుకాల్వల నిర్మాణం, విద్యుత్తు ఏర్పాట్లు, రహదారులు నిర్మించలేదు. వాటన్నింటిని పూర్తిచేశాకే లబ్ధిదారులకు తాళాలు అప్పగించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనలు చెందొద్దు. త్వరలో పనులు పూర్తి చేయిస్తాం.నర్సయ్య, పంచాయతీరాజ్ శాఖ సహాయక ఈఈ

# సింగరేణి స్థలం.. ఆక్రమణల పర్వం

గోదావరిఖని : అది వంద ఫీట్ల రహదారి కోసం సేకరించిన భూమి.. మేడిపల్లి గ్రామం నుంచి రామగుండం వెళ్లేందుకు లింకు రోడ్డు కోసం సింగరేణి సంస్థ 25 ఏళ్ల క్రితం 13.12 ఎకరాల భూమిని సేకరించింది. వంద ఫీట్ల మేర రహదారి నిర్మించేందుకు పట్టాదారుల నుంచి భూమిని సేకరించింది. ప్రస్తుతం ఆ రహదారి 30 ఫీట్లకే పరిమితం చేశారు. దీంతో ఇరువైపులా భూమిని కబ్జా చేస్తున్నారు. సింగరేణి సంస్థ మేడిపల్లి ఓసీపీ ఏర్పాటు సమయంలో మేడిపల్లి గ్రామం నుంచి రామగుండం వరకు వెళ్లేందుకు లింకురోడ్డు కోసం 15 సర్వే నెంబర్ల నుంచి 13.12 ఎకరాల భూమిని సేకరించింది. దీనికి సంబంధించి పట్టాదారులకు రూ.55 లక్షలు చెల్లించింది. 1998లో రహదారి కోసం సేకరించిన భూమిలో కొంతమంది ఇరువైపులా నిర్మాణాలు చేపడుతున్నారు. 100 ఫీట్ల మేర నిర్మించాల్సిన రహదారిని కుదించడంతో ఇరువైపులా ఆక్రమణల పర్వం సాగుతోంది. ప్రస్తుతం మేడిపల్లి ఓసీపీ మూసివేయడంతో సింగరేణి సంస్థ రహదారి కోసం సేకరించిన భూమిపై దృష్టి సారించలేకపోతుంది. దీంతో

పలువురు హద్దులు సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు.

స్పందించని అధికారులురహదారి నిర్మాణం కోసం సేకరించిన భూమి కబ్జాకు గురవుతున్నా ఇటు సింగరేణి, అటు రెవెన్యూ అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సింగరేణి సంస్థ మేడిపల్లి గ్రామస్థులు బయటకు వెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన కొంత మంది పట్టాదారుల నుంచి భూమిని సేకరించింది. ప్రస్తుతం భూమి విలువ పెరగడంతో రహదారిని కుదించి మిగిలిన భూమిని కొందరు ఆక్రమించుకుంటున్నారు. రహదారికి కేటాయించామన్న కారణంతో సింగరేణి యాజమాన్యం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తుందని పలువురు అంటున్నారు. రెవెన్యూ శాఖ సైతం రహదారి కోసం కేటాయించిన స్థలమన్న భావనతోనే ఉన్నట్లు వ్యవహరిస్తోంది. కాగా కొంత మంది పథకం ప్రకారమే రహదారి నిర్మాణాన్ని కుదించినట్లు తెలుస్తోంది. 100 ఫీట్ల వెడల్పుతో నిర్మించాల్సిన రహదారి కుదించి నిర్మాణం చేయడంతో కబ్జాదారులు దర్జాగా ఆక్రమించుకునేందుకు అవకాశం ఏర్పడింది. 13.12 ఎకరాలు కేవలం రహదారి విస్తీర్ణం కోసమే సింగరేణి సంస్థ సేకరించింది. రహదారి కుదించడంతో సుమారుగా 4 నుంచి 5 ఎకరాల స్థలం ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# అప్రెంటిస్‌షిప్‌కు సింగరేణి ఆహ్వానం

కొత్తగూడెం : ఏడాది వ్యవధితో కూడిన అప్రెంటిస్‌షిప్ చేసేందుకు సింగరేణి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది నోటిఫికేషన్ 10న వెలువడగా, 14 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసే అవకాశాన్ని కల్పించింది. హార్డు కాపీలను 30 తేదీ లోగా స్థానికేరియాలోని ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్(ఎంవీటీసీ)ల్లో అందజేయాలి. మొత్తం 1,344 మంది అభ్యర్థులకు ఈ ఏడాది అప్రెంటిస్‌షిప్ అవకాశం కల్పిస్తున్నారు.

స్థానికులకు 95 శాతం రిజర్వేషన్లు

ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల వారు స్థానికులు. వీరికి 95 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. మిగిలిన ఉమ్మడి జిల్లాల వారంతా స్థానికేతరులు. వీరికి ఐదు శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది. తుది జాబితా కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయం ఎన్నుకునే ప్రత్యేక కమిటీ రూపొందిస్తుంది. ఎంపిక ప్రక్రియ జులై చివరి వారం లోగా పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థుల జాబితా సింగరేణి వెబ్‌సైట్, ప్రధాన కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తారు.

ఉపకార వేతనాలిలా

రెండు సంవత్సరాల ఐటీఐ పూర్తిచేసిన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మెషనిస్టు, మెకానిక్ మోటార్‌వెహికిల్, డ్రాఫ్ట్స్‌మెన్ కోర్సుల వారికి రూ.8,050.. ఏడాది వ్యవధితో కూడిన కోర్సులైన డీజిల్ మెకానిక్, వెల్డర్ తదితర అభ్యర్థులకు నెలకు రూ.7,700 ఉపకార వేతనం అందజేస్తారు. వయసు 18-28 ఏళ్లలోపు కలిగిఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులైతే 33 ఏళ్ల లోపువారై ఉండాలి.

తొలి ప్రాధాన్యం కార్మికులకే

కొత్తగా సింగరేణిలో ఉద్యోగంలో చేరిన కార్మికులెవరైనా దరఖాస్తు చేసుకొంటే తొలి ప్రాధాన్యం ఇస్తారు. ఐటీఐ ఉన్నప్పటికీ ఆ అర్హతపై కాకుండా జనరల్ మజ్దూర్లుగా పనిచేస్తున్న కార్మికులకు వయసుతో సంబంధం లేకుండా అప్రెంటిస్‌షిప్ అవకాశాన్ని ఇవ్వనున్నారు. ఆ తర్వాత సింగరేణి ఉద్యోగుల పిల్లలు, సింగరేణి ప్రభావిత ప్రాంతాల వారు, నిర్వాసితుల పిల్లలకు సీట్ల భర్తీలో ప్రాధాన్యమిస్తారు. వీరు కాకుండా సింగరేణి ఏరియాలో బయటి నుంచి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు స్థానికత ప్రాతిపదికన 30 శాతం సీట్లు కేటాయించాలనే నిబంధన ఉంది.

కావాల్సిన ధ్రువపత్రాలు

పదో తరగతి, తత్సమానమైన అర్హత గల ధ్రువీకరణ పత్రం

ఐటీఐ ధ్రువపత్రం

కుల ధ్రువీకరణ

ఆధార్ కార్డు

రెండు పాస్‌పోర్టు ఫొటోలు

దరఖాస్తు వివరాలు..అభ్యర్థులు వివరాలు రిజిస్టర్ చేసుకునేందుకు 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. అప్రెటిస్‌షిప్‌ఇండియా.ఓఆర్‌జీ' వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. పూర్తిచేసిన దరఖాస్తులను 'ఎస్‌సీసీఎల్‌మైన్స్.కామ్' అనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. హార్డు కాపీలను నెలాఖరులోగా స్థానిక ఎంవీటీసీల్లో సమర్పించాలి.

# మాటే.. మంత్రమై..!

కొత్తగూడెం : ఎదుటివారిని ఆకట్టుకునే అంశాల్లో ప్రధానమైనది మాట్లాడే తీరు. ఎదురెదురుగా ఉన్నప్పుడు ఎలా మాట్లాడాలి, గుడిలో- బడిలో ఎలా మాట్లాడాలి, రాజకీయ ప్రసంగం ఎలా?, శాస్త్రవేత్తల ఆవిష్కరణల ఉపన్యాసం. ఇలా.. అనేక రకాలుగా మాట్లాడే తీరే మన స్థాయిని నిర్ధారిస్తుంది. ఒకరు మాట్లాడుతుంటే వినాలనిపిస్తుంది. వేరొకరు మాట్లాడుతుంటే అబ్బా ఏమిటీ గోల.. అన్నట్లుగా ఉంటుంది. మాట తీరే నాయకత్వ లక్షణాలనూ పెంపొందిస్తుంది. ఇంతటి కీలకమైన మాట తీరును మెరుగుపరిచే దిశగా అక్కడ విద్యార్థులను సంసిద్ధం చేస్తోంది అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలోని టాక్ క్లబ్.కళాశాలలో ప్రతి వారం విద్యార్థులతో ఏదో ఒక అంశంపై మాట్లాడిస్తారు. మంచి వక్తలుగా ఎంపికైన వారితో మరోసారి పోటీలు నిర్వహిస్తారు. అందువల్ల మాటతీరు, హావభావాలు, అంశాన్ని పక్కదారి పట్టకుండా చెప్పడంలో వారిలో ఉన్న సృజనాత్మకత వెలికి వస్తోంది. ఇలాంటి కార్యక్రమాన్ని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల 2015 నుంచి నిర్వహిస్తోంది.

లాయర్లు కోర్టులో మాట్లాడలేకపోతే కేసు గెలవలేరు. రాజకీయ నాయకులు ఆకట్టుకునేలా మాట్లాడలేకపోతే మనుగడ ఉండదు. శాస్త్రవేత్తలు రూపొందించిన ఆవిష్కరణలు సరైన రీతిలో వివరించకపోతే ఆ ప్రయోగాలకు ఫలితం ఉండదు. మాట్లాడాలని ఉన్నా వేదికపై మాట్లాడలేరు కొంతమంది. అలాంటి వారిని భయం లేకుండా మాట్లాడేలా తయారుచేస్తోంది టాక్ క్లబ్. ఇన్నివిధాలుగా వాక్పటిమకు గుర్తింపు ఉండబట్టే తొమ్మిదేళ్లుగా వ్యవసాయ కళాశాలలో నిరంతరంగా టాక్ క్లబ్ కొనసాగుతోంది.

ఎక్కువగా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, అనుబంధ రంగాలు, వ్యవసాయ ఆర్థిక అభివృద్ధి అంశాలతో పాటు ప్రస్తుత రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలనూ జోడిస్తూ టాక్‌క్లబ్‌లు నిర్వహిస్తుంటారు. ఫస్ట్ ఇయర్‌లో మాట్లాడటానికి భయపడే విద్యార్థులను చివరి సంవత్సరం వచ్చేసరికి అనర్గళంగా ప్రసంగించేలా చేయడమే ఈ క్లబ్ ప్రధాన లక్ష్యం అంటారు కళాశాల ఏడీ డాక్టర్ అహ్మద్‌హుస్సేన్, క్లబ్ నిర్వాహకుడు, సహాయ ఆచార్యుడు డాక్టర్ ఎం.రాంప్రసాద్.

భయాన్ని పోగొట్టింది

ఎం.సుధాకర్, ఏజీబీఎస్సీ 4వ సంవత్సరం

మన ఆలోచనా విధానాన్ని ఎలా బయటకు తీసుకురావాలో తెలియజెపుతోంది. నలుగురిలో మాట్లాడాలంటే భయం, ఏమనుకుంటారో ఏమో అనే న్యూనతాభావం ఉండేది. ఆ భయాలన్నింటిని టాక్ క్లబ్ పోగొట్టింది. అంశం ఏదైనా ఆకట్టుకునేలా మాట్లాడేందుకు ప్రయత్నిస్తాను.

స్వీయవిశ్వాసం పెరిగింది

తులసి ప్రియ, ఏజీబీఎస్సీ 4వ సంవత్సరం

కళాశాలలో చేరిన తొలిరోజుల్లో నలుగురిలో మాట్లాడాలంటే భయం. ఎవరైనా చూస్తున్నారేమో, తప్పు మాట్లాడుతున్నానేమో అనే బిడియం ఉండేది. టాక్ క్లబ్‌లో మాట్లాడటం ప్రారంభించాక కొద్దికొద్దిగా భయం పోయి 'ఎస్.. నేను మాట్లాడగలను' అన్న ఆత్మవిశ్వాసం పెరిగింది. నా మనసులోని భావాలు వేదికపై చెప్పగలుగుతున్నాను.

మాటతీరు మెరుగుపడింది

మనీష, ఏజీబీఎస్సీ 4వ సంవత్సరంఎలా మాట్లాడాలో, ఎలా మాట్లాడకూడో టాక్ క్లబ్ నేర్పింది. ఎలా మాట్లాడితే తోటి విద్యార్థులే కాదు వేదికపై ఉన్న వారు కూడా ఆసక్తిగా వింటారో నేర్చుకున్నాను. దీనివల్ల నేను మాట్లాడగలను అనే ధైర్యం వచ్చింది.

# ఖాళీ స్థలం.. ఆదాయ మార్గం

ఖమ్మం : సాగునీటి ప్రాజెక్టులు, కాల్వకట్టల స్థలాలు ఆక్రమణకు గురవకుండా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆహ్లాదకర వాతావరణాన్ని సృష్టించి పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలనే లక్ష్యంతో 'దశాబ్ది సంపద వనాలు' ఏర్పాటు చేయాలని సంకల్పించింది. గుర్తించిన స్థలాల్లో 'తెలంగాణకు హరితహారం'లో భాగంగా పండ్లు, కలపను ఇచ్చే మొక్కలను పెంచనుంది.జలవనరులశాఖ అధికారులు తొలుత స్థలాలను శుభ్రం చేయించి హద్దులు నిర్ణయిస్తారు. పంచాయతీరాజ్ శాఖ సహకారంతో కంచె, గేటు, ఆర్చి నిర్మిస్తారు. నిర్ణీత నమూనా ప్రకారం ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లు, కలప మొక్కలు నాటుతారు. మొక్కల పెంపకాన్ని పర్యవేక్షించే బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగిస్తారు. పెరిగిన చెట్లతో వచ్చే ఆదాయాన్ని ఆయా పంచాయతీలే పొందనున్నాయి.

కొలతల ప్రకారం గుంతలు

బ్లాక్ ప్లాంటేషన్‌కు 45ఐ45ఐ45 సెంమీ, బ్లాక్ చుట్టూ ట్రెంచ్‌లో 45ఐ45ఐ45 సెంమీ, లీనియర్ ప్లాంటేషన్‌కు 60ఐ60ఐ60 సెంమీ కొలతలతో గుంతలు తవ్వుతారు. స్థలాల పరిమాణాన్ని బట్టి 0.5 ఎకరం- ఎకరం, ఎకరం- మూడెకరాలు, మూడెకరాలు- 20 ఎకరాలుగా విభజించారు.గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం, నీటిని అందించడం, నిర్వహణ వంటి ఖర్చులను నాలుగేళ్లపాటు ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తారు. ఫెన్సింగ్, గాడి కొట్టడం, గేటు, ఆర్చి నిర్మాణ వ్యయాన్ని హరిత నిధి నుంచి సంబంధిత కలెక్టర్ సమకూరుస్తారు.

ఎక్కడెక్కడ ఎన్నెన్ని మొక్కలంటే..

0.5- ఎకరం లోపు స్థలంలో దారి ఏర్పాటుచేయాలి. ఫెన్సింగ్ వెంట 58 వెదురు, లోపల పండ్ల మొక్కలు 342 నాటాలి.

ఎకరం- మూడెకరాల్లోపు స్థలం మధ్యలో ప్లస్ ఆకారంలో దారి ఏర్పాటుచేయాలి. చుట్టూ మూడు వరుసలుగా 224 వెదురు, మధ్యలోని నాలుగు భాగాల్లో 804 పండ్లు, కలపనిచ్చే మొక్కలు నాటాలి.

3- 20 ఎకరాల స్థలాల్లో మధ్యలో ప్లస్ ఆకారంలో దారి ఏర్పాటుచేయాలి. చుట్టూ మూడు వరుసలుగా 199 వెదురు, 1,899 పండ్లు, కలపనిచ్చే మొక్కలు నాటాలి.

0.5- ఎకరం స్థలాలు: ఖమ్మం జిల్లాలోని ఐదు ప్రాంతాల్లో మూడెకరాలను గుర్తించారు.

ఎకరం- 3 ఎకరాలు: ఖమ్మం జిల్లాలోని ఎనిమిది ప్రాంతాల్లో 12.03 ఎకరాలు గుర్తించారు.

కాల్వకట్టలపై ఒకటి, రెండు వరుసల లీనియర్ ప్లాంటేషన్‌కు భద్రాద్రి జిల్లాలో 38 కి.మీ. గుర్తించారు. 2022- 23లో 19 కి.మీ పొడవున మొక్కలు నాటారు. మిగిలిన 19 కి.మీ. స్థలంలో ఈఏడాది మొక్కలు నాటుతారు. ఖమ్మం జిల్లాలో 572 కి.మీ. గుర్తించారు. 2022-23లో 368 కి.మీ. పొడవున మొక్కలు నాటారు. మరో 204 కి.మీ. స్థలం అందుబాటులో ఉంది.దశాబ్ది సంపద వనాలను సృష్టించేందుకు గుర్తించిన స్థలాల్లో పనులు ప్రారంభించాం. సోమవారం లోగా మొక్కలు నాటుతాం. పర్యావరణ పరిరక్షణతో పాటు పంచాయతీలకు ఆదాయం సమకూర్చడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.ఎం.విద్యాచందన, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, ఖమ్మం

# డెంగీతో గ్రామాలు విలవిల

ఖమ్మం :ఈ ఏడాది మార్చిలో అశ్వాపురం మండలం అమీర్దా గ్రామం డెంగీ జ్వరాలతో విలవిలలాడింది. రోజుకొకరు చొప్పున మూడు రోజుల్లో ముగ్గురు మృతిచెందారు. ఇంకా ఆ గ్రామాన్ని డెంగీ జ్వరాలు పట్టిపీడిస్తూనే ఉన్నాయి. కరకగూడెంలో ఇటీవల డెంగీ జ్వరాలు విజృంభించి ముగ్గురిని బలి తీసుకున్నాయి. అదే మండలం తాటిగూడెంలో పలువురు డెంగీతో బాధపడుతున్నట్లు సమాచారం. మణుగూరు మండలంలోని రామానుజవరంలో ఓ యువకుడు డెంగీతో గురువారం తనువు చాలించారు. జిల్లాలోని వివిధ గ్రామాల్లో డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో అనేక మంది చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి కొందరు చనిపోతున్నారు. డెంగీ బారిన పడుతున్నవారిలో దాదాపుగా నిరుపేదలే ఉంటున్నారు. ఏదో ఒక కూలీ పని చేసుకుంటే తప్ప పొట్ట గడవదు. జ్వరం తగ్గిన తరవాత నెలరోజుల వరకు వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. కూలీ పనులకు వెటళ్లలేక కుటుంబాలు గడవటమే కష్టంగా ఉంటోంది.

వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం..!

సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని తెలిసినా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయటం లేదు. జ్వరాలు విజృంభించగానే ఆయా గ్రామాలను సందర్శించి కుటుంబ సర్వేలు చేపడుతున్నారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. నిజానికి డెంగీ కారక దోమలు మంచినీటి నిల్వల్లోనే ఉంటాయి. అక్కడే గుడ్లు పెడతాయి. పగలు మాత్రమే కుడతాయి. డెంగీ ఉన్న వ్యక్తిని కుట్టిన దోమ మరో వ్యక్తిని కుట్టడం ద్వారా మాత్రమే ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఇళ్లల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవటమే ఉత్తమమైన మార్గం. ప్రజలకు ఈ విషయంపై అవగాహన కల్పించాల్సిన వైద్య ఆరోగ్య శాఖకు పట్టింపు లేకపోవటం గమనార్హం.

పారిశుద్ధ్యం అధ్వానం

అనేక గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. సరైన డ్రైనేజీ సదుపాయం లేదు. అక్కడక్కడ ఉన్నా నిర్వహణ పడకేసింది. గృహాల నుంచి విడుదలయ్యే వ్యర్థపు నీరు ఎక్కడ పడితే అక్కడే నిల్వ ఉంటోంది. దోమలకు ఆలవాలమవుతోంది. ఏదైనా ఓ గ్రామంలో జ్వరాలు ప్రబలగానే నామమాత్రంగా బ్లీచింగ్ పొడి చల్లి ఫాగింగ్ చేస్తున్నారనే వాదనలున్నాయి. జ్వరాలు ప్రబలకుండా నిరోధించగలిగే కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవటం లేదు.

శక్తికి మించి వైద్యం..!

ఇదే అదనుగా కొందరు గ్రామీణ వైద్యులు శక్తికి మించి వైద్యం చేస్తున్నారు. సొమ్ములకు ఆశపడి ప్రాణాల మీదకు తెస్తున్నారు. కొన్నిసార్లు జ్వరం తగ్గుతోంది. మరికొన్నిసార్లు విషమిస్తోంది. అట్లాంటి పరిస్థితుల్లో వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. స్థానిక వైద్యాధికారులకూ సమాచారం ఇవ్వడం లేదు. అక్కడ పరీక్షల అనంతరం డెంగీగా నిర్ధారణ అవుతోంది. అప్పటికే పరిస్థితి విషమించడంతో ప్రాణాల మీదకు వస్తోంది. గతంలో అశ్వాపురంలోని ఆ గ్రామీణ వైద్యుడిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

వైద్యాధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. అవగాహనతోనే డెంగీని అరికట్టగలం. ఇళ్లల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలి. ఫాగింగ్ చేయాలి. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. డాక్టర్ ఎన్.మణికంఠరెడ్డి, ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి

# పంట రుణం.. పంపిణీలో జాప్యం!

ఖమ్మం : వానాకాలం సీజన్ వచ్చేసింది. అయినా ఇంతవరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పంట రుణాల ప్రణాళిక ఖరారు కాలేదు. దుక్కులు సిద్ధం చేసుకుని రుణాల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు పాత రుణాల రెన్యువల్ తప్ప కొత్తవాటి ఊసే లేదు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జరుగుతుండటం, సహకార సంఘాల ఆధ్వర్యంలో మక్కలు, ధాన్యం కొనుగోళ్లు నిర్వహించటం లాంటి కార్యక్రమాల్లో అధికారులు, ఉద్యోగులు నిమగ్నమై ఉన్నందున కొంత జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమాలు పూర్తయిన వెంటనే రుణాల పంపిణీ ప్రక్రియ వేగవంతం అవుతుందని ఓ అధికారి చెప్పారు. ప్రభుత్వం వ్యవసాయ సీజన్‌ను ముందుకు తెచ్చి రైతులతో ప్రత్యామ్నాయ, వాణిజ్య పంటలు సాగు చేయించేందుకు ప్రయత్నిస్తోంది. సహజంగా ఏప్రిల్ నుంచి పంట రుణాల పంపిణీ ప్రారంభిస్తే మే నెలాఖరుకు లేదా జూన్ నెలలో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుంది. దుక్కి దున్నేందుకు పెట్టుబడి అవసరం. బ్యాంకులు సకాలంలో రుణాలు మంజూరు చేయకపోవటం వల్ల అనేక మంది రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

కౌలు రైతుల ఊసేది..?

కౌలు రైతుల గురించి పట్టించుకున్న నాథుడే లేడు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సుమారు 65వేల మంది కౌలు రైతులు ఉన్నారు. అసలు రైతులు వ్యవసాయాన్ని వదిలేసి పట్టణాలకు వలస వెళ్లటంతో కౌలు రైతులే ఇప్పుడు సాగు చేస్తున్నారు. వీరికి కౌలు కార్డులు/రుణాలు

మంజూరు కావటం లేదు. కౌలు రైతు చట్టాన్ని అమలుపరిచి వీరికి కూడా బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా ప్రభుత్వం కృషి చేయాలని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.పంట రుణాల ప్రణాళికను కలెక్టర్ అనుమతితో త్వరలోనే విడుదల చేస్తాం. ఇప్పుడు ఎండల తీవ్రత అధికంగా ఉంది. వర్షాలు ప్రారంభం కాగానే బ్యాంకులు రుణాలు ఇవ్వటం మొదలు పెడతాయి. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వానాకాలం పంట రుణాల పంపిణీ ప్రక్రియ జూన్, జులై నెలల్లో పూర్తవుతుంది.

శ్రీనివాసరెడ్డి, అగ్రణీయ బ్యాంకు మేనేజర్, ఖమ్మం

# 40 ఏళ్ల తర్వాత.. బస్టాండ్ ఆధునికీకరణ

వరంగల్ : దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత వరంగల్ బస్టాండ్ ఆధునికీకరణకు మోక్షం లభించింది. 1978-79లో వరంగల్ బస్ స్టేషన్ మంజూరైంది. 1984లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఈ బస్టాండ్‌ను ప్రారంభించారు. పెరిగిన రద్దీ, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అత్యాధునిక పద్ధతులు, విధానాలతో ఇప్పుడు కొత్త బస్టాండ్ డిజైన్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్, నియో మెట్రో రైల్వేస్టేషన్ ఒకే గొడుగు కిందకు రానున్నాయి. వరంగల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు ప్రత్యేక దారి ఏర్పాటుకు ప్రతిపాదించారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) ఆధ్వర్యంలో సుమారు రూ.73.50 కోట్లతో ప్రాథమిక అంచనాలు రూపొందించారు. టీఎస్‌ఆర్టీసీ, కుడా మధ్య ఒప్పందం కుదిరింది. జీప్లస్-5 భవన నిర్మాణం చేపడతారు. భూగర్భ మార్గంలో రెండు పార్కింగ్ కేంద్రాలు, టీఎస్‌ఆర్టీసీ కార్యాలయం, వ్యాపార వాణిజ్య దుకాణాలు, బడ్జెటు హోటల్, రెస్టారెంటు, బాంకెటు హాల్, ఆఫీస్ స్పేస్, మల్టీ ప్లెక్స్ తదితర నిర్మాణాలు చేస్తారు. ఒకేసారి 30-35 ఆర్టీసీ బస్సులు నిలిపేలా డిజైన్ చేశారు.

రూ.280కోట్లతో ఇన్నర్ రింగు రోడ్డు

పదేళ్లుగా నానుతున్న ఇన్నర్ రింగురోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. వరంగల్ త్రినగరాల చుట్టూ అంతర్ వలయ రహదారి (ఇన్నర్ రింగు రోడ్డు) ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. సుమారు రూ.280 కోట్లతో అత్యాధునిక విధానాలు, పద్ధతులతో 200 అడుగుల వెడల్పుతో ఈ రహదారి అభివృద్ధి పనులు చేపడతామని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సుందర్‌రాజ్ తెలిపారు. శనివారం సాయంత్రం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారన్నారు. శుక్రవారం సాయంత్రం రంగశాయిపేట నాయుడు పంపు కూడలిలో శిలాఫలకం ఏర్పాటు పనులు ఛైర్మన్ పరిశీలించారు. ఖమ్మం జాతీయ రహదారి, నర్సంపేట, ఏటూరునాగారం, కరీంనగర్ జాతీయ రహదారుల అనుసంధానంగా డిజైన్ చేశారు. మొత్తం 15 కిలో మీటర్లు ఉంటుంది. తొలివిడతలో రంగశాయిపేట నాయుడు పంపు నుంచి ఎనుమాముల వరకు పనులు జరుగుతాయి. రెండో విడుతలో ఎనుమాముల నుంచి ఆరెపల్లి వరకు చేపడతారు. భూసేకరణపై నెలకొన్న వివాదాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పరిష్కరించారు. రైతులను పిలిపించి మాట్లాడారు.

# కాజీపేట జంక్షన్.. ఇక్కడ వాహనాలకు అనుమతి లేదు!

వరంగల్ :రామరాజు అనే వ్యక్తి తన కుటుంబసభ్యులను రైలు ఎక్కించడానికి కారులో కాజీపేట రైల్వే స్టేషన్‌కు వచ్చారు. కారును పార్కింగ్ చేస్తామని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ) స్టేషన్ వైపు వెళ్లారు. అక్కడ అడ్డుగా ఆటోలు ఉన్నాయి. లోనికి వెళ్లలేక ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్ వైపు వచ్చారు. అక్కడ ఎక్కడా నో పార్కింగ్ బోర్డు కనిపించకపోవడంతో ఇదే పార్కింగ్ స్థలం అనుకుని కారును నిలిపారు. స్టేషన్ లోపలికి వెళ్లి బయటకు వచ్చేసరికి ఆర్పీఎఫ్ పోలీసులు కారుకు తాళం వేసి జరిమానా విధించారు. తన కారును ఎక్కడ పెట్టుకోవాలో తెలిపి జరిమానా వేయాలని అడిగినా వారు సమాధానం ఇవ్వలేదు..కాజీపేట రైల్వే స్టేషన్ ముందున్న ప్రధాన సమస్య.

కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద వాహన పార్కింగ్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లు ఇతర వాహనాలు ఎక్కడ నిలపాలో తెలిపే బోర్డులుండాలి. నిషేధిత ప్రాంతంగా చెప్పే సూచికలు ఏర్పాటు చేయాలి.. ఇవేవీ ఇక్కడ కనిపించవు. ఆర్పీఎఫ్ పోలీసులు మాత్రం కఠినంగా నిబంధనలు పాటిస్తారు. పార్కింగ్ స్థలంలో తప్ప స్టేషన్ ఏరియాలో ఎక్కడ వాహనం నిలిపినా జరిమానాలు, కొన్నిసార్లు కేసు నమోదు చేసి కోర్టు మెట్లు ఎక్కించి అక్కడ జరిమానాలు వేయిస్తున్నారు.

కారు పార్కింగ్ ఎక్కడా?

జంక్షన్ ముందు కారు పార్కింగ్ స్థలం ఎక్కడో పోలీసులకే సరిగా తెలియడం లేదు. జీఆర్‌పీ పక్కన ప్రైవేటు కార్లు పార్కింగ్ చేయాలి.. ఇక్కడ కార్లు లోనికి వెళ్లకుండా అడ్డుగా ఆటోలు నిలిచి ఉంటాయి. ఆర్పీఎఫ్ కార్యాలయం పక్కనే పెడతామంటే అక్కడ రైల్వే ఉద్యోగులకు మాత్రమే అనుమతి. ఆర్పీఎఫ్ కార్యాలయం, జీఆర్‌పీ కార్యాలయం,

స్టేషన్ ముందు భాగంలో వాహనాలు నిలపడం నిషేధం.. ఈ విషయాన్ని తెలిపే బోర్డులు ఎక్కడా కనిపించవు. ఎక్కడ పార్కింగ్ చేసినా ఆర్పీఎఫ్ సిబ్బంది వెంటనే వాహనానికి తాళం వేసేస్తారు. దాన్ని తీయించడానికి సిబ్బంది చుట్టూ రోజంతా తిరగాల్సి వస్తోంది. సిబ్బంది లేరని ప్రైవేటు వ్యక్తులను పెట్టి వీరు వాహనాలకు తాళాలు వేయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

రైలు ఛార్జీల కంటే అధికం

విష్ణు తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్‌లో పెట్టి సికింద్రాబాదు వెళ్లి వచ్చారు. ఇందుకు 12 గంటల సమయం పట్టింది. దీనికి రూ.120 ఛార్జీ వేశారు. రైలు ఛార్జీ సికింద్రాబాద్ వెళ్లి రావడానికి రూ.130 అయింది. పార్కింగ్‌కు ఇంత ఎందుకయ్యిందంటే రైల్వే నిర్ణయించిన ధరలే అని పార్కింగ్ యజమాని అనడంతో విష్ణు అవాక్కయ్యారు.

స్టేషన్ల వారీగా రుసుం..రైల్వే స్టేషన్ల స్థాయిని బట్టి పార్కింగ్ రుసుం నిర్ణయిస్తున్నారు. కాజీపేట, వరంగల్, ఖమ్మం లాంటి ఏ స్థాయి రైల్వే స్టేషన్లలో మొదటి రెండు గంటలకు గంటకు రూ.20 చొప్పున, ఆ తర్వాత ప్రతి గంటకు రూ.10 చొప్పున ఉంటుంది. జనగామ, మహబూబాబాద్, స్టేషన్ ఘనపురం రైల్వే స్టేషన్లలో గంటకు రూ.5 చొప్పున తీసుకుంటారు. సికింద్రాబాదు లాంటి స్టేషన్లో గంటకు రూ.40 వసూలు చేస్తున్నారు.సైకిల్‌కు కూడా ...సైకిళ్లకు కూడా పార్కింగ్ ఛార్జీని వసూలు చేస్తున్నారు. ఒక్క రోజు సైకిల్ పెడితే రూ.120 చెల్లించాల్సిందే. ప్రతి గంటకు రూ.5 చొప్పున వసూలు చేస్తున్నారు. మరచిపోయి పది రోజులు సైకిల్ పెట్టిన వ్యక్తి అది పాతది అయితే అక్కడే వదిలేసి వెళుతున్నారు. కారు ఉన్న వ్యక్తి విమానాశ్రయంలో పార్కింగ్ ఛార్జీలకు ఏమాత్రం తీసిపోకుండా రుసుము చెల్లించాల్సిందే..చెల్లించకపోతే బెదిరింపులు..స్టేషన్ ముందు లోనికి వెళ్లి రావడానికి కొందరూ ద్విచక్రవాహనాల్లో వస్తుంటారు. వీరు తమ వాహనాన్ని స్టేషన్ ముందు నిలిపి లోనికి వెళ్లి వచ్చేలోపే పార్కింగ్ యజమాని చీటి పెట్టి రూ. 15 వసూలు చేస్తున్నారు. స్టేషన్ ఏరియా మొత్తం పార్కింగ్‌కు నిషేధితమని ఆర్పీఎఫ్ చెబుతుంటే అలాంటప్పుడు బయటి వాహనాలకు పార్కింగ్ యజమాని డబ్బులు ఎలా వసూలు చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి.

# ఎదిగె.. శ్రీవల్లి..!

మంచిర్యాల : సెప్టెంబరులో జరిగే ఇన్‌స్పైర్ జాతీయ పోటీలకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభచూపి జాతీయ స్థాయిలో సత్తా చాటేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 ప్రాజెక్టులు ఎంపిక కాగా.. ఉమ్మడి జిల్లా నుంచి మంచిర్యాల నుంచి ఒకే విద్యార్థి ఇన్‌స్పైర్ ప్రదర్శనలకు ఎంపికైంది.

కరోనా కారణంగా రెండేళ్లుగా ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టులకు సంబంధించి ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో ఆన్‌లైన్‌లో పోటీలను నిర్వహించారు. ప్రస్తుతం అనుకూల పరిస్థితులు ఉండటంతో ప్రాజెక్టుల ప్రదర్శన ప్రత్యక్షంగా నిర్వహించాలని తలపెట్టింది. రాష్ట్ర స్థాయికి వివిధ జిల్లాల నుంచి ఎంపికైన ప్రదర్శనలు సమర్పించిన విద్యార్థులు గైడ్ టీచర్లతో హైదరాబాద్‌లోని ఐఐటీలో గత ఏప్రిల్ నెలలో రెండు రోజుల పాటు కార్యశాలలో పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సాయి శ్రీవల్లి ప్రతి స్త్రీ నెల వారీ రుతుక్రమం ప్రక్రియలో

వినియోగిస్తున్న సానిటరీ ప్యాడ్ ఇబ్బందులను, ఆరోగ్య సమస్యలను దూరం చేసేందుకు రూపొందించిన శ్రీస్ రుతుమిత్ర కిట్ పరికరం అంశాలను ప్రదర్శించారు. ఐఐటీ డైరెక్టర్ వీటిని పరిశీలించి జాతీయ స్థాయిలో నిలదొక్కుకునేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో శ్రీవల్లి అక్కడి నిపుణులతో మెలకువలను నేర్చుకుంది.

సన్నద్ధం..జాతీయ స్థాయిలో మెరవాలంటే అమలుకు దగ్గరగా ప్రదర్శనాంశాలు ఉండాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సూచించింది. ఇందుకు అవసరమైన డబ్బులు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు ప్రదర్శనకు అవసరమైన మార్పులు చేసే క్రమంలో రూ. 10 వేలకు ప్రతిపాదనలు పంపించగా విద్యార్థిని ఖాతాల్లో జమ చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలుండే విధంగా విద్యార్థులు గైడ్ టీచర్లు ఈ క్రమంలో కసరత్తు చేస్తున్నారు. ఎలాగైనా జాతీయ స్థాయిలో మెరవాలని పట్టుదలతో శ్రీవల్లి స్వయంగా గత వారం సిద్ధిపేటలోని స్వచ్ఛబడికి వెళ్లారు. తన ప్రాజెక్టును మెరుగుపర్చుకోవడానికి అక్కడ క్లాత్ ప్యాడ్ వినియోగిస్తున్న మహిళలకు తన ప్రాజెక్టును వివరించారు. పాఠశాల ఇన్‌ఛార్జి దీప్తి, మానస ద్వారా తనకు అవసరమైన సలహాలను తీసుకొన్నారు.

ఉత్తములకు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు

జాతీయ స్థాయిలో ఉత్తమంగా నిలిచిన ప్రదర్శనలకు జాతీయ స్థాయి గుర్తింపు దక్కుతుంది. పేటెంట్ పొందడంలో సహాయం చేస్తూ రూ. 40 నుంచి 60 వేల వరకు ఆర్థిక సాయం అందిస్తారు. భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు పొందే అవకాశం ఉంటుంది. అంతర్జాతీయ విజ్ఞాన కేంద్రాల్లో పాల్గొనే భాగస్వామ్యం ఉంటుంది. ఐఐటీ ప్రవేశాలలో చేరేందుకు తగిన రిజర్వేషన్, ఇంజినీరింగ్ చదవడానికి సాయం పొందవచ్చు.

# అంతటా అవినీతి.. ఏసీబీ జాడేది?

ఆదిలాబాద్ : అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో చేతివాటం లేకుండానే వాహనాలను పంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఒక్క రూపాయి తీసుకోకుండానే ఉద్యోగులు పనిచేస్తున్నారు. పర్సంటేజీలు తీసుకోకుండానే ఇంజినీర్లకు బిల్లులు చేసి ఇస్తున్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు వారినుంచి ఏమి ఆశించకుండా తమకు వచ్చే నెల వేతనంతోనే సరిపెట్టుకుంటున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఎవరూ లంచం అడగడం లేదు. ఏంటి? అంతా మారిపోయింది. స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా అవినీతి రహిత సమాజం ఏర్పడుతోందని అనుకుంటున్నారా? అలా అయితే మీరు పప్పులో కాలేసినట్లే.. ఎందుకంటే అవినీతి నిరోధక శాఖ అధికారుల కేసుల సంఖ్యను చూస్తే ప్రభుత్వం యంత్రాంగమంతా ఏతప్పూ చేయకుండా ఉందనిపిస్తోంది. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. కొంతకాలంగా ఆ శాఖాధికారుల దాడులు చేయకుండా చేతులుముడుచుకుని కూర్చున్నారు..ప్రభుత్వ శాఖల్లో అవినీతిని రూపుమాపేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కొద్దికాలంగా క్రియారహితంగా మారిపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన కార్యాలయం ఆదిలాబాద్ పట్టణంలో ఉంది. డీఎస్పీ స్థాయి అధికారి ఉండే ఈ కార్యాలయంలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆదిలాబాద్‌కు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా ఎవరైనా లంచం అడిగితే ఈ శాఖ ఫిర్యాదు స్వీకరిస్తుంది. ఆ తరువాత డబ్బులు తీసుకునే సమయంలో దాడిచేసి కేసులు నమోదు చేస్తుంది. ఈ కేసులను ట్రాప్ కేసులంటారు.

ఫిర్యాదు రాకున్నా..ఎలాంటి ఫిర్యాదు రాకున్నా ఎవరైనా అధికారి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టుకున్నారని తెలిస్తే ఈ శాఖాధికారులు దాడులు చేస్తారు. ఆదాయానికి మించి ఆస్తుల (డీఏ) కేసులే ఈ శాఖపనితీరుకు గీటురాయి. జిల్లాలో ఏటా ఇలాంటి ఒక కేసుతోనే సరిపెడుతున్నారు. ఒక్కో ఏడాదైతే అదిసైతం నమోదు కావడంలేదు.

మునుపటి ప్రచారం ఏది?

అవినీతి అంతంపై ఈ శాఖ విస్తృతంగా ప్రచారం చేయాలి. అన్నిశాఖల కార్యాలయాల వద్ద గోడప్రతులు అతికించాలి. డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలని చరవాణి నంబర్లు ప్రదర్శించాలి. తరచు కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. కానీ కొంతకాలంగా పూర్తి స్తబ్ధత నెలకొంది.

అవినీతి జడలు విప్పుతున్నా..అన్ని శాఖల్లో అవినీతి జడలువిప్పుతున్నా ఏసీబీ మాత్రం జఢత్వం వీడటంలేదు. కొన్నిశాఖల్లో ఇంజినీర్లైతే రూ.కోట్లకు పడగలెత్తారు. పనుల్లో నాణ్యతను గాలికొదిలేసి స్వలాభం చూసుకుంటున్నారు. మరికొందరు రవాణాశాఖ అధికారుల ఆదాయానికి హద్దులేదనేది బహిరంగ రహస్యం. కొందరు రెవెన్యూ శాఖాధికారులు రూ.వందల కోట్ల విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములను ప్రైవేటు వ్యక్తులపరం చేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. కొందరైతే పేదల సంక్షేమం పేరిట వచ్చిన డబ్బులను మింగేస్తున్నారు. అమాయక రైతులను లంచం పేరిట వేధిస్తున్నారు. పత్రికల్లో వీటిపై తరచూ వార్తలు కూడా వస్తున్నాయి. అయినా వారిపై అనిశా ఎందుకు దృష్టిపెట్టడం లేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఏడాది ఒకటే..ఈ ఏడాది అనిశా దాడులు తగ్గుముఖం పట్టాయి. ట్రాప్ కేసులు ఒక్కటీ నమోదు కాలేదు. మే 24న నిర్మల్ జిల్లాలో ఒక తహసీల్దార్‌పై ఆదాయానికి మించి ఆస్తులున్నాయని దాడులు చేశారు. 2022లో ఈ ఒక్క కేసు మాత్రమే నమోదైంది.

అధికారి వివరణ..ఈ విషయమై ఏసీబీ డీఎస్పీ భద్రయ్యను సంప్రదించగా.. ఆదాయానికి మించి ఆస్తుల కేసుల్లో వారికి సంబంధించి పూర్తి వివరాలపై కసరత్తు చేయాల్సి ఉంటుందన్నారు. అందుకనే ఈ కేసుల సంఖ్య తక్కువగా ఉంటుందన్నారు. ఎవరైనా సమాచారమిస్తే ఆ అధికారుల పని పడతామని పేర్కొన్నారు. ఏ శాఖలోనైనా లంచం అడిగితే ఆదిలాబాద్‌లోని గాంధీపార్కు వెనుకాల ఏసీబీ కార్యాలయంలో సంప్రదించాలని వివరించారు. తన చరవాణి నం.94404 46166కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వవచ్చని వివరించారు.

# ఏళ్ల కష్టం.. నీళ్లపాలు

మంచిర్యాల : రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి వారం దరిది.. ఓ పూట కడుపు మాడ్చుకుంటూ, పైసాపైసా కూడబెట్టుకుంటూ ఇంట్లో ఈ వస్తువు లేదు అనే మాటే రాకుండా ఉన్నదాంట్లోనే ఉన్నతంగా జీవిస్తున్నారు. వీరిని చూసి వరుణుడికి కన్నుకుట్టిందో ఏమో.. భారీ వర్షాలతో వరదలను తీసుకొచ్చాడు.. ఒక్కరాత్రిలోనే వారి జీవితాలు నీటి పాలయ్యేలా చేశాడు. వారి బతుకులను మళ్లీ మొదటికి తీసుకొచ్చాడు. వారు చేసేది చిరుద్యోగం.. నెలకు వచ్చేది ఎనిమిదివేలు. ఈ సంపాదనతో ప్రస్తుతం కుంటుంబాన్ని ఎలా పోషించేది.. చెడిపోయిన సామగ్రిని తిరిగి ఎలా సంపాదించుకునేది. ఇటీవల వచ్చిన వరదల కారణంగా ఇలాంటి నిరుపేదలు ఇంకా కోలుకోలేకపోతున్నారు.ఇటీవల వచ్చిన వరదలతో భారీ నష్టం జరిగింది. సుమారు 12 కాలనీ (పాతమంచిర్యాల, గణేష్‌నగర్, మేదరివాడ, పద్మశాలికాలనీ, ఎల్ఐసీకాలనీ, రాంనగర్, ఎన్టీఆర్‌నగర్, కాలేజిరోడ్, లేబర్‌కాలనీ, బాలాజీనగర్, రాళ్లపేట తదితర కాలనీలు)ల్లో 2270 నివాసాలు వరదలో మునిగినట్లు తేల్చారు. ఆయా గృహాల్లో మొత్తం రూ.15 కోట్ల విలువైన సామగ్రి చెడిపోయినట్లు సమాచారం.

ఒక్కో రూపాయి కూడబెట్టి..పాతమంచిర్యాలకు చెందిన శ్రీనివాస్.. జీజీహెచ్ ఆసుపత్రిలో రోగి సంరక్షుడి (పారిశుద్ధ్య విభాగానికి చెందిన గుత్తేదారుడి దగ్గర)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతనికి వచ్చే వేతనం రూ.7-8వేలు. ఈ జీతంతోనే కుటుంబాన్ని పోషించాలి. అయినా ఉన్నంతలోనే ఒక్కో రూపాయి జమచేసుకుంటూ చిన్నపాటి సొంత నివాసాన్ని నిర్మించుకున్నారు. కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసుకుని బతుకుతున్నారు. కానీ రాత్రికి రాత్రే వరద తన ఇంటిని ముంచెత్తి అల్లకల్లోలం చేసింది. టీవీ, ఫ్రిజ్, కూలర్ ఇలా ఎలక్ట్రానిక్ వస్తువులు చెడిపోవడంతో పాటు నిత్యావసర సామగ్రి వరదల్లో కొట్టుకుపోయింది. సుమారు రూ.70వేలు నష్టం వచ్చిందని, మళ్లీ కోలుకోవాలంటే ఎన్ని సంవత్సరాలు పడుతుందో కూడా చెప్పలేనంటున్నారు శ్రీనివాస్.

కన్నీటిని మిగిల్చిఎన్టీఆర్ నగర్‌కు చెందిన శ్రీనివాస్ ధర్మాసుపత్రిలో భద్రతా విభాగంలో పనిచేస్తున్నారు. వేతనం తక్కువైనా ఉన్నదాంట్లోనే సర్దుకుంటూ ఇంట్లోకి కావాల్సిన విలువైన సామగ్రితో పాటు అన్ని రకాల వస్తువులను అందుబాటులో ఉంచుకున్నారు. ఇటీవల వచ్చిన వరదలు అతన్ని మళ్లీ మొదటికి తీసుకొచ్చాయి. నివాసం నీటిలో మునిగిపోవడంతో ఎలక్ట్రానిక్ సంబంధించిన ఏ ఒక్క వస్తువు కూడా వినియోగించుకునే పరిస్థితి లేకుండా పోయింది. చిరుద్యోగిగా కష్టపడి సంపాదించుకున్న వస్తువులన్నీ వరదపాలయ్యాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు శ్రీనివాస్. రూ.లక్ష వరకు నష్టం రాగా తిరిగి కొనుగోలు చేసే పరిస్థితి కూడా ఇప్పట్లో కనిపించడంలేదంటున్నారు.

నిల్వ ఉంచిన బియ్యం తడిసె..సత్తు సంపత్-మమత స్థానిక ఎన్టీఆర్‌నగర్‌లో నివాసముంటున్నారు. సంపత్ భవన నిర్మాణానికి చెందిన సెంట్రింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వరదలు తన కాలనీని ముంచెత్తడంతో తీవ్రంగా నష్టపోయారు. సాఫీగా సాగుతున్న తన జీవితానికి ఈ విపత్తు అడ్డంకిగా మారింది. వరదనీరు ఇంటిని ముంచడంతో ఈ ఘటనకు కొద్దిరోజుల ముందే కొనుగోలుచేసి నిల్వ ఉంచుకున్న బియ్యం నీళ్లపాలయ్యాయి. వీటితో పడకలు, సిలిండర్లు, దుస్తులు ఇలా నిత్యావసరాలన్నీ వరదపాలయ్యాయి. సుమారు రూ.90వేల విలువ చేసే వస్తువులు కొట్టుకుపోయాయని, తిరిగి సంపాదించాలంటే మూడు, నాలుగేళ్లు పడుతుందని మమత ఆవేదనతో చెప్పుకొచ్చారు.

సర్దుకునే అవకాశంలేక..పాతమంచిర్యాల నివాసి అయిన అశోక్.. జీజీహెచ్ ఆసుపత్రిలో పారిశుద్ధ్య గుత్తేదారు కింద రూ.8వేల వేతనానికి ఎంఎన్ఓగా పనిచేస్తున్నారు. రాళ్లవాగు ఉప్పొంగడంతో ఇతని నివాసం నీటిలో మునిగిపోయింది. రేకులతో నిర్మించిన గృహం కావడం, ముందస్తు సామగ్రిని భద్రపరుచుకునే అవకాశం లేకపోవడం, రాత్రికి రాత్రే నీరు కాలనీని చుట్టుముట్టడంతో ఏమీ చేయాలో తోచక వదిలిపెట్టి వెళ్లారు. వస్తువులను వరదపాలు చేశారు. టీవీతో పాటు పడకలు, నిత్యావసర వస్తువులు, సరకులు, దుస్తులు మొత్తం నీటిలో తడిసిముద్దయ్యాయి. చాలీ చాలని వేతనంతో కుటుంబాన్ని నెట్టుకొస్తుండగా ఈ వరదలతో వచ్చిన రూ.60 వేల నష్టంతో మరింత ఇబ్బందికర పరిస్థితి వచ్చిందని చెబుతున్నారు అశోక్.

# మురుగు-శుద్ధి వైపు ముందడుగు

మంచిర్యాల : ఖానాపూర్ చెరువులోకి సమీప ఇళ్ల నుంచి మురుగు వచ్చి చేరడంతో నీరంతా కలుషితమవుతోంది. పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వస్తోంది. భూగర్భ జలాలు తాగేందుకు పనికిరాకుండా పోతున్నాయి. ఇక్కడ మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం కానుండటంతో కాలుష్యం తగ్గిపోనుంది.ఆదిలాబాద్ పట్టణంలో నిత్యం ఇళ్ల నుంచి వచ్చే మురుగు కాలువల నుంచి నేరుగా వాగులు, చెరువుల్లోకి చేరుతోంది. దీంతో అందులోని నీరు కలుషితం కావడంతోపాటు జలచరాలకు ముప్పు ఏర్పడుతోంది. భూగర్భ జలాలు సైతం కలుషితమైపోయి తాగడానికి పనికిరాకుండా పోయే పరిస్థితి తలెత్తుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం మురుగు నీటి శుద్ధి కేంద్రాల(సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్-ఎస్‌టీపీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు సమగ్ర పథక స్వరూపాన్ని (డీపీఆర్) పంపాల్సిందిగా ఆదేశాలను జారీ చేసింది. దీంతో ఎస్‌కే అసోసియేషన్ అనే ప్రైవేటు సంస్థ.. ప్రజారోగ్య ఇంజినీరింగ్ శాఖ, బల్దియా అధికారుల సమన్వయంతో డీపీఆర్‌ను రూపొందిస్తున్నారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా.. కేంద్రం వాటా 33శాతం వ్యయాన్ని, రాష్ట్రప్రభుత్వం, బల్దియా వాటా కలిపి 67శాతం నిధులను ఈ ప్రాజెక్టు కోసం ఖర్చు చేయనున్నారు.

పట్టణంలో ఎస్‌టీపీని ఏర్పాటు చేసేందుకు ఎంపిక చేసిన ప్రాంతంలో ప్రత్యేకంగా భూగర్భ పైప్‌లైన్ వేస్తారు. కాలనీలోని అన్ని ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థ జలాలను పైప్‌లైన్‌కు అనుసంధానం చేస్తారు. అలా వచ్చిన మురుగును ఎస్‌టీపీకి మళ్లించి శుద్ధీకరణ ప్రక్రియ చేపడతారు. రసాయనాలను కలిపి అందులోని మలినాలను, హానికారక జలాలను తొలగించి శుద్ధి చేస్తారు. ఆ తర్వాతే నీటిని సమీప వాగులు, చెరువుల్లోకి వదులుతారు. దీంతో నీటి వనరులు, భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉంటాయి. ఎస్‌టీపీలు ఏర్పాటైన చోట ఎలాంటి దుర్వాసన ఉండదని, భవిష్యత్తులో పట్టణానికి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఈ ఎస్‌టీపీలను అనుసంధానం చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

అయిదు చోట్ల ఏర్పాటుకు నిర్ణయం..

పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో అయిదు చోట్ల ఎస్‌టీపీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఖానాపూర్, సుభాష్‌నగర్, చిల్కూరి లక్ష్మీనగర్, ఇందిరమ్మ కాలనీ, కేఆర్కే కాలనీలో ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఇటీవలే అధికారులు సర్వే చేశారు. భౌగోళికంగా ఎత్తు నుంచి పల్లం వైపు మురుగు ప్రవహించే చోట వీటి నిర్మాణానికి అనువైన బల్దియా, రెవెన్యూ స్థలాలు అందుబాటులో ఉన్నాయా లేవా అని అన్వేషిస్తున్నారు. ఈ ప్రక్రియ కొలిక్కి రాగానే ఎంత సామర్థ్యంతో నిర్మించాలి. అందుకు ఎన్ని కిలోమీటర్ల పైప్‌లైన్ వేయాల్సి ఉంటుంది.. వంటి పూర్తి వివరాలతో డీపీఆర్‌ను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు. ప్రభుత్వం ఆమోదించగానే క్షేత్రస్థాయిలో నిర్మాణానికి బాటలు పడతాయి.

మురికివాడలకు మేలు : జోగు ప్రేమేందర్, పురపాలక అధ్యక్షుడు

మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణంతో మురికివాడలకు ఎంతో మేలు కలుగుతుంది. ఎంపిక చేసిన అయిదు ప్రాంతాల్లో పకడ్బందీగా డ్రైనేజీ వ్యవస్థ ఉంటుంది. రోడ్లపై మురుగు పారడం, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితులు దూరమవుతాయి.

సర్వే జరుగుతోంది : హరిభువన్, ఏఈఈ, ప్రజారోగ్య ఇంజినీరింగ్ శాఖ

రాష్ట్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా ఎస్‌టీపీల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం బల్దియా అధికారులతో కలిసి స్థల పరిశీలన చేస్తున్నాం. సర్వే పూర్తయ్యాక డీపీఆర్‌ను తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం.

# గేట్లు మెరుగుపడి.. ఆశల సవ్వడి

మంచిర్యాల : కడెం జలాశయం వరదగేట్ల మరమ్మతులు త్వరలో పూర్తికానున్నాయి. కడెం ఆయకట్టు రైతులకు ఇది ఒకరకంగా తీపికబురే.. అధికారులు ఈ పనులను వేగంగా పూర్తిచేస్తున్నారు. గతనెలలో వచ్చిన భారీ వరదలతో కడెం వరదగేట్లు దెబ్బతిని ఎత్తి ఉంచడంతో కడెం జలాశయం మొత్తం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఈ నెలాఖరుకు గేట్లను బాగుచేసి కడెం నిండితే సాగుకు నీరిస్తామని అధికారులు మొదట ప్రకటించారు. అయితే పనులు వేగంగా చేస్తుండడంతో వరదగేట్లు కిందకు దిగడం, ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

అన్నదాతకు భరోసానిస్తూ..

కడెం జలాశయం కింద సుమారు 65వేల ఎకరాల్లో పంటసాగవుతుంది. కడెం, దస్తూరాబాద్, జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, మంచిర్యాల వరకున్న ఆయకట్టు రైతులు కడెం మొన్నటి వరదలకు దెబ్బతినడంతో ఆందోళనకు గురయ్యారు. అధికారులు చొరవ తీసుకుని పనులను వేగవంతం చేసి తెరిచి ఉంచిన 18 వరదగేట్లను మరమ్మతుచేసి కిందకు దించారు. రెండు మూడు గేట్లకు కిందవైపు ఇరుక్కున్న చెత్తను తొలగిస్తే పూర్తిగా లీకేజీలు తగ్గుతాయి. ఇపుడు అన్నిగేట్లను మూసినా ఎగువనుంచి వరదనీరు వస్తుండడంతో ఒకటి, రెండు గేట్లు ఎత్తుతూ కొంతమేర నీటిని దిగువకు వదులుతు

న్నారు. ఇదివరకే నారు పోసుకున్నవారు దాన్ని కాపాడుకుంటుండగా.. నాలుగైదు రోజులుగా రైతులు మొలక నారు, బురదనారు పోసుకుంటు పంటసాగుకు సిద్ధం అవుతున్నారు. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 700 అడుగులు కాగా 685.6 అడుగులకు చేరుకోవడంతో ఇక పంటకు నీరిస్తారనే నమ్మకం రైతుల్లో పెరుగుతోంది.

కాలువలు మెరుగుపడితే మేలు..దెబ్బతిన్న కడెం ప్రధానకాలువను ఇంకా మెరుగుపర్చలేదు. చిన్నపాటి గండ్లు పడడం, అక్కడక్కడ తూములవద్ద మరమ్మతు చేయాల్సి ఉంది. వాటి మరమ్మతు త్వరగా చేపడితే కాలువలకు నీరిచ్చేందుకు ఆటంకం తొలగిపోతుందని, ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేసి నీరిచ్చే ఏర్పాట్లుచేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.త్వరగా నీరిచ్చేలా చూస్తాం.. - రాజశేఖర్ గౌడ్, ఈఈ కడెంవరదగేట్లను కిందకు దించే ప్రక్రియ పూర్తిచేశాం. వాటిలో కొన్నింటిని మళ్లీ ఎత్తుతూ, దించుతూ పనితీరును పరిశీలిస్తున్నాం. మరికొన్నింటికి చిన్నపాటి మరమ్మతులు చేపడుతున్నాం. వరదనీటిని కొంతమేర నిల్వచేస్తూనే మరమ్మతు పనులు చేయిస్తున్నాం. కాలువలను మెరుగుపర్చాల్సి ఉంది. అవి త్వరగా పూర్తిచేయించి పంటకు నీరిచ్చేలా చూస్తాం.

# పెరుగుతున్న గోదారి.. ఆందోళనలో ప్రజలు

మంగపేట : గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చింది. గతనెలలో సంభవించిన వరదలతో అతలాకుతలమైన ప్రజలు.. మళ్లీ వరద పెరుగుతుండడంతో భయాందోళనలకు గురవుతున్నారు. జాతీయరహదారిలోని పూసూరు-ముల్లెకట్ట హైలెవెల్ వంతెన వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువప్రాంతంలోని ప్రాజెక్టులు, ప్రాణహిత, ఇంద్రావతి గోదావరి ఉపనదుల నుంచి వస్తున్న వరదనీటితో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలోని టేకులగూడెం సమీపంలో జాతీయరహదారి ముంపునకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. వాజేడు-గుమ్మడిదొడ్డి గ్రామాలమధ్య రహదారిపై కొంగాలవాగు వరద చేరింది. రెండురోజులుగా స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం సోమవారం రాత్రి నుంచి వేగంగా పెరుగుతోంది. పేరూరులో మంగళవారం సాయంత్రం 6 గంటలకు 47.39 అడుగులకు (14.45 మీటర్లు) చేరుకుంది.

ఉప్పొంగిన వాగులుమండలంలోని వాగులకు గోదావరి వరద పోటెత్తింది. పెంకవాగు, కంకలవాగు, జిన్నెలవాగు, బల్లకట్టువాగు,

కుక్కతోగువాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద నీటి ప్రవాహం అధికం కావడంతో వాగులు ప్రమాదకరంగా మారాయి. వెంకటాపురం-మల్లాపురం మార్గ మధ్యలో కంకలవాగు ఉధ్రుతికి రాకపోకలు ఆగాయి. పెంకవాగు లోలెవల్ చప్టా వరద నీటి ముంపునకు గురైంది. ఆవలి ప్రాంతంలోని గిరిజనులు ప్రవాహంలోనే రాకపోకలు సాగించారు. ద్విచక్రవాహనాలను సైతం మోసుకొని వాగు దాటించుకున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వరద నీటి ప్రవాహం అంతకంతకు పెరుగుతుండటంతో మళ్లీ కష్టాలు తప్పేలా లేవని గిరిజనం ఆందోళన చెందుతున్నారు.

# ఆసరాపై ఆశలు..

కామారెడ్డి : ఆసరా దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. స్వాతంత్ర్య వజ్రోత్సవాల సందర్భంగా కొత్తగా ఆసరా పింఛన్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. జిల్లాలో ఇప్పటికే దరఖాస్తులు చేసుకుని పింఛన్ల కోసం మూడున్నరేళ్లుగా ఎదురుచూస్తున్నవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల కొత్త దరఖాస్తులు అందుతూనే ఉన్నాయి. తెరాస ప్రభుత్వం రెండోసారి కొలువుదీరిన తర్వాత కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు.

ఇది వరకే వేలల్లోజిల్లాలో ఆసరా పథకం కింద తమకు వివిధ విభాగాల్లో పింఛన్లు మంజూరు చేయాలని ఇది వరకే 9,367 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి అర్హతలను మండల, జిల్లాస్థాయి అధికారులు ధ్రువీకరించారు. ఇవికాకుండా రాష్ట్ర ప్రభుత్వం పింఛను వయస్సును 65 నుంచి 57 సంవత్సరాలకు తగ్గించింది. దీని కింద రెండు దశల్లో జిల్లావ్యాప్తంగా 29,162 దరఖాస్తులు వచ్చాయి. కొత్తగా డయాలసిస్

రోగులకు కూడా నెలకు రూ.2016 పింఛను అందజేస్తామని సీఎం ప్రకటించారు.

ఇదీ జిల్లా పరిస్థితి..జిల్లావ్యాప్తంగా అన్ని విభాగాల్లో 1.46 లక్షల మందికి ప్రతి నెల పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇందులో వృద్ధాప్య, వితంతు పింఛన్లే అధికంగా ఉన్నాయి. అర్హులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం ఆలస్యం చేసింది. చివరిసారిగా 2018 జులైలో 2,500 మందికి మంజూరు చేశారు. ఆ తర్వాత ఊసే లేకుండా పోయింది.. ప్రతి నెల 300 నుంచి 500 దరఖాస్తు అందుతున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో తమకు ఇప్పటికైనా పింఛన్లు వస్తాయని భావిస్తున్నారు. కొత్తగా డయాలసిస్ రోగులకు కూడా అందే అవకాశాలు ఉన్నాయి. వయస్సు తగ్గించిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించలేదు. మరి మంజూరు చేస్తారా లేదా అనే ప్రశ్న తలెత్తుతోంది.

ఉత్తర్వులు రాగానే.. : - సాయన్న, డీఆర్డీవో, కామారెడ్డి

కొత్త పింఛన్ల మంజూరు కోసం ప్రభుత్వ ఉత్తర్వులు రావాల్సి ఉంది. అన్ని విభాగాల్లో దరఖాస్తులు స్వీకరించాం. ప్రభుత్వ సూచన ప్రకారం ముందుకెళ్తాం.

దిల్లీ: ఉక్రెయిన్‌పై ఏడాదికి పైగా రష్యా సాగిస్తున్న దండయాత్ర విషయంలో భారత్ తటస్థ వైఖరి అవలంబిస్తోందంటూ పశ్చిమ దేశాలు ఆ మధ్య ఆరోపించాయి. దీనిపై తాజాగా భారత ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. తాము శాంతి వైపే ఉన్నామని చెప్పారు. అమెరికా పర్యటనకు బయల్దేరే ముందు వాల్ స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. దీంతో పాటు భారత్–చైనా సంబంధాలు, అమెరికాతో బంధం.. ఇలా పలు అంశాల గురించి మోదీ స్పందించారు. "మేం తటస్థ వైఖరి ప్రదర్శిస్తున్నామని కొంతమంది అన్నారు. కానీ మేం తటస్థం కాదు. శాంతి వైపు నిలబడుతున్నాం. దేశాల సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ చట్టాలను ప్రతి దేశం గౌరవించాలి. దౌత్యపరమైన మార్గాలు, చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలి. అంతేగానీ యుద్ధంతో కాదు" అని మోదీ తెలిపారు. సమస్య పరిష్కారం కోసం రష్యా, ఉక్రెయిన్ దేశాల అధినేతలు పుతిన్, జెలెన్‌స్కీతో తాను పలుమార్లు మాట్లాడినట్లు ప్రధాని గుర్తుచేశారు. "భారత్ ఏం చేయగలదో అన్నీ చేస్తోంది. ఘర్షణలను పరిష్కరించి ఇరు దేశాల మధ్య శాంతి, స్థిరత్వాన్ని తీసుకొచ్చేందుకు అన్ని ప్రయత్నాలను మేం సమర్థిస్తున్నాం" అని మోదీ తెలిపారు.

**సరిహద్దుల్లో ప్రశాంతతే ముఖ్యం..** ఇక, భారత్–చైనా మధ్య సంబంధాల గురించి ప్రస్తావిస్తూ.. "ద్వైపాక్షిక బంధాలు నిలబడాలంటే.. సరిహద్దు ప్రాంతాల్లో శాంతియుత, నిశ్చలమైన పరిస్థితులు చాలా ముఖ్యం. సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత, వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడంపై మాకు విశ్వాసం ఉంది. అదే సమయంలో, భారత్ తన గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు సంసిద్ధంగా ఉంది" అని మోదీ వ్యాఖ్యానించారు.

**ఏ దేశ స్థానాన్నీ భర్తీ చేయాలనుకోవట్లేదు..** భారత్ – అమెరికా మధ్య బంధం మునుపటి కంటే మరింత బలంగా ఉందని ప్రధాని అన్నారు. ఇరు దేశాల నేతల మధ్య అమితమైన విశ్వాసం ఉందన్నారు. ఇక ప్రపంచ రాజకీయాల గురించి స్పందిస్తూ.. "ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో విస్తృత పాత్ర పోషించేందుకు భారత్ అర్హమైనదే. విద్య, మౌలిక సదుపాయాల్లో భారత్ విస్తృత పెట్టుబడులు పెడుతోంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల పరిస్థితుల్లో తయారీ, సరఫరా గొలుసును పెంపొందించేందుకు బహుళజాతి సంస్థలు మావైపు చూస్తున్నాయి. అయితే మేం ఏ దేశ స్థానాన్నీ భర్తీ చేయాలనుకోవట్లేదు. కేవలం ప్రపంచంలో మేం సరైన స్థానాన్ని దక్కించుకోవాలని మాత్రమే కోరుకుంటున్నాం" అని మోదీ వివరించారు.

**అలా తొలి ప్రధానిని నేనే..** స్వాతంత్ర్య భారత దేశంలో పుట్టిన తొలి ప్రధానమంత్రిని నేనే. అందుకే, నా ఆలోచనా విధానాలు, ప్రవర్తన అన్నీ.. మా దేశ చరిత్ర, సంప్రదాయాల నుంచి ప్రేరణ పొందినట్లుగానే ఉంటాయి. అదే నా బలం. దీన్నే నేను ప్రపంచానికి పరిచయం చేస్తున్నా" అని మోదీ తెలిపారు. ప్రధాని మోదీ నేడు అమెరికా పర్యటనకు బయల్దేరారు. బుధవారం నుంచి ఆయన అగ్రరాజ్యంలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా ఐరాసలో జరిగే అంతర్జాతీయ యోగా వేడుకలకు ఆయన నేతృత్వం వహించనున్నారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆతిథ్యాన్ని స్వీకరించనున్నారు.

విజయవాడ: అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు నైరుతి రుతుపవనాలు కాస్త ఉపశమనం కలిగించే సంకేతాలు అందించాయి. ఈ నెల 11 నుంచి కర్ణాటక–ఏపీ సరిహద్దుల వద్ద నిలిచిపోయిన రుతుపవనాల్లో కదలిక ప్రారంభమైంది. మంగళవారం ఏపీలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించాయి. దీని ప్రభావంతో ఏపీలోని పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వర్షం పడింది. ఇవాళ సాయంత్రం విజయవాడలో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. గత రెండు వారాలుగా నగరంలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఎండ తీవ్రతకి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ఇవాళ వర్షం కురవడంతో విజయవాడ ప్రజలు సేదతీరారు.

**తెలంగాణలో రాగల 3 రోజులు వర్షాలు :** ఈరోజు నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల రెండు మూడు రోజుల్లో ద్వీపకల్ప దక్షిణ భారతంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని వివరించింది. తెలంగాణలో రాగల 3 రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా ఈరోజు ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్, జనగాం జిల్లాలలో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉందని సంచాలకులు హెచ్చరించారు.

# ఏపీకి విలన్ చంద్రబాబే : మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: రాష్ట్రానికి విలన్ టీడీపీ నేత చంద్రబాబేనని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పన్నుల భారం మోపి, ఇష్టారీతిన విద్యుత్ చార్జీలు పెంచి, పెట్రోల్, డీజిల్‌పై అదనపు వ్యాట్ విధించి ప్రజలను కోలుకోలేని విధంగా దెబ్బతీశారని మండిపడ్డారు. చంద్రబాబు పూర్తిగా అరాచక పాలన సాగించారని విమర్శించారు. ఇప్పుడేమో వైయస్ జగన్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధిని అడ్డుకునేందుకు అడుగడుగునా కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు విమర్శలను ఖండిస్తూ మంత్రి రజిని ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ చార్జీలు పెంచారని చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు విద్యుత్ చార్జీలను భారీగా పెంచిన విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా విద్యుత్ చార్జీల మోత మోగించేవారని గుర్తు చేశారు. 2015 ఫిబ్రవరిలో పెట్రోల్, డీజిల్‌పై ఏకంగా రూ.4 అదనపు వ్యాట్ విధించిన చరిత్ర చంద్రబాబుదన్నారు. రాష్ట్రంలో బెల్టుషాపుల వ్యవస్థను సృష్టించిన చంద్రబాబు.. మద్యపాన నిషేధాన్ని సైతం ఎత్తివేశారని.. అలాంటి వ్యక్తి నేడు మద్యం గురించి మాట్లాడుతుండటం సిగ్గుచేటన్నారు. టీడీపీ నాయకులు ఊరూరా మద్యం అమ్ముకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బెల్టుషాపులన్నింటినీ రద్దు చేసిందని గుర్తు చేశారు. 2019 ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలను మభ్య పెట్టేందుకు టిడ్కో ఇళ్లను తెరపైకి తెచ్చారని విమర్శించారు. అందుకే ప్రజలు టీడీపీకి తగిన విధంగా బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో ఎన్ని హత్యలు జరిగాయో, మహిళలపై ఎన్ని అఘాయిత్యాలు జరిగాయో, టీడీపీ గూండాలు ఎలా రెచ్చిపోయారో ప్రజలింకా మర్చిపోలేదన్నారు. శాంతిభద్రతల విషయంలో వైయస్ జగన్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసుల పనితీరుకు గాను ఇప్పటికే 200కు అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. నాడు టీడీపీ నేతలు పెద్ద ఎత్తున భూ అక్రమాలకు పాల్పడితే.. చంద్రబాబు వారందరికీ అండగా నిలిచారని విమర్శించారు.

భువనేశ్వర్: ప్రఖ్యాత జగన్నాథుని రథయాత్ర సందర్భంగా పూరీ నగరం భక్తులతో నిండిపోయింది. ఒడిశాతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో శ్రీక్షేత్రం పరిసరాలతో పాటు అక్కడి వీధులన్నీ కిక్కిరిపోతున్నాయి. 'జై జగన్నాథ' నినాదాలతో పూరీ నగరం మార్మోగుతోంది. ఈ ఉదయం జగన్నాథ, బలభద్ర, సుభద్ర, సుదర్శనుల విగ్రహాలను రథాలపై ప్రతిష్ఠించి తరువాత మంగళహారతి చేపట్టారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ రథాలపై చెరాపహర (బంగారు చీపురుతో ఊడ్చడం) చేశారు. 3 గంటలకు భక్తులు రథాలను లాగడం మొదలు పెట్టారు.. సాయంత్రం రథాలు గుండిచా మందిరానికి చేరుకున్నాయి.

# జగన్‌ను పారదోలే సమయం ఆసన్నమైంది

పల్నాడు: జగన్‌ను పారదోలే సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం దాచేపల్లి మండలం తంగెడలో రచ్చబండ – ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో యరపతినేని పాల్గొన్నారు. గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో పల్నాడులో టీడీపీ కార్యకర్తలపై దాడులను యరపతినేని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరచరిత్ర కలిగిన జగన్‌కు పాలించే అర్హత లేదన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారం అరాచకాలు చేయడానికి కాదని తెలిపారు. తప్పుడు కేసులు పెట్టే పోలీసులపై అధికారంలోకి వచ్చాక చర్యలు తప్పవని హెచ్చరించారు. పల్నాడులో టీడీపీ కార్యకర్తలపై వరుస దాడులు జరుగుతున్నాయని.. తప్పులు చేస్తున్న వైసీపీ నాయకులు, పోలీసులపై చర్యలు తప్పవని తెలిపారు. హత్యా రాజకీయాలు చేసినవారిని వదలమన్నారు. "నేను మారిన శ్రీనుని.. మంచికళ్ళు శ్రీనుని కాదు... నన్ను మళ్లీ మంచికళ్ళు శ్రీనుని చేయ్యొద్దు.. వైసీపీ నాయకుల ధన దాహానికి గురజాలలో 8 మంది చిన్నారులు బలయ్యారు. వైసీపీ నాయకులు అక్రమంగా తవ్విన క్వారీ గుంతల్లో పడి చిన్నారులు చనిపోయారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోంది. బాబాయి హత్య కేసులో ఎవరూ తప్పించుకోలేరు. ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా మార్చారు" అంటూ యరపతినేని శ్రీనివాస్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

విజయవాడ : ఏపీలో చడీ చప్పుడు లేకుండా ఓ కొత్త పార్టీ ఆవిర్భవించింది. ఎలాంటి హంగామా లేదు. కనీసం ఒక చిన్న ప్రకటన కూడా లేకుండా కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. పార్టీ పేరు ఇంచుమించు తెలుగుదేశం పార్టీ మాదిరిగానే ఉంది. తెలుగు వాడి ఆత్మగౌరవం పేరుతో నాడు ఎన్టీఆర్ టీడీపీని ప్రారంభిస్తే.. ఇప్పుడు తెలుగు భాషా పరిరక్షణ కోసం అంటూ జై తెలుగు పార్టీని కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు ప్రారంభించారు. తెలుగు భాషా సంస్కృతి కోసం ప్రత్యేక రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తున్నానని జొన్నవిత్తుల పేర్కొన్నారు. రాజకీయ నాయకులకు, ప్రజలకు సరైన అవగాహన కల్పించడమే తన లక్ష్యమని తెలిపారు. వారిని చైతన్య వంతులుగా చేయడానికే ఈ రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏపీ బాగా నష్టపోయిందని జొన్నవిత్తుల అన్నారు. భాషా, సంస్కృతి పూర్తిగా వీధిన పడిపోయిందన్నారు. ఈ విలువల కోసం రాజకీయ నాయకులు, ప్రజలు పనిచేయాలన్నారు. జై తెలుగు పేరుతో ఐదు రంగులతో పతాకాన్ని కూడా రూపొందించానని జొన్నవిత్తుల తెలిపారు. నీలం రంగు జలం, పచ్చ రంగు వ్యవసాయం, ఎరుపు రంగు శ్రమశక్తి, పసుపు వైభవానికి చిహ్నం, తెలుపు జల వనరులు స్వచ్ఛంగా ఉండాలన్నారు. వెనుక తెలుగు భాష రథాన్ని ప్రజలు లాగాలనేది తన ఆకాంక్షగా జొన్నవిత్తుల చెప్పుకొచ్చారు. తెలుగు భాష కోసం ఐదుగురు మహనీయులు కృషి చేశారని.. త్యాగాలు చేశారని వెల్లడించారు. గిడుగు రామ్మూర్తి నాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులు, పొట్టి శ్రీరాములు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, మాజీ ముఖ్యమంత్రి యన్టీఆర్ చిత్రాలు తన జై తెలుగు రాజకీయ జెండాలో, ఎజెండాలో ఉంటాయన్నారు. తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన వారు ఎందరో ఉన్నా.. ఈ ఐదుగురు ముందు వరుసలో ఉంటారని జొన్నవిత్తుల అన్నారు. మన భాషా సంస్కృతి వైభవం గురించి నేడు ఎవ్వరికీ తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నాడు మదరాసీలు అన్నారని.. నేడు హైదరాబాదీలు అనిపించుకుంటున్నామన్నారు. కానీ తెలుగు వాళ్లం అని మాత్రం అనిపించులేక పోతున్నామన్నారు. మన భాషను మనమే విస్మరించి చులకన చేసుకున్నామని జొన్నవిత్తుల పేర్కొన్నారు. తెలంగాణ భాష మొత్తం ఒక్కటే.. ఏపీలో మాత్రం ప్రాంతాల వారీగా భాష మారిపోతుందన్నారు. ఉత్తరాంధ్ర, గోదావరి, కృష్ణా–గుంటూరు, నెల్లూరు, రాయలసీమ ఐదు రకాల భాషలు ఏపీకి ఉన్నాయన్నారు. తెలుగు భాషకు పునర్వైభవాన్ని తీసుకురావాలనేదే తన సంకల్పమన్నారు. మన భవిష్యత్తు తరాలకు మన తెలుగు భాషను అందించాలన్నారు. లక్షల కోట్ల బడ్జెట్, అధికారం ఉన్న ప్రభుత్వాలు తెలుగు భాషకు సమున్నత స్థానం కల్పించాలన్నారు. మాతృ భాష పరిరక్షణ .. రాజకీయ నాయకుల బాధ్యత అన్నారు. ఆగస్ట్15 నాటికి తమ పార్టీ విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. తెలుగు భాషా పరిరక్షణ అజెండాతో వచ్చే ఎన్నికలలో పోటీ చేస్తామని జొన్నవిత్తుల ప్రకటించారు.

# పదే పదే తొక్క తీస్తా.. నారా తీస్తా అన్నారు..

## ఎంతమందికి తీయించారో చెప్పండి?.. పవన్‌కు ముద్రగడ లేఖ

కాకినాడ: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం లేఖ రాశారు. బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తామని తరచూ అంటున్నారని.. అటువంటప్పుడు జనసేన పార్టీకి మద్దత్తు ఇవ్వాలని.. తనను ముఖ్యమంత్రిని చేయాలని ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. 175 స్థానాలకు పోటీ చేసినప్పుడు ముఖ్యమంత్రిని చేయాలి అనే పదం వాడాలన్నారు. కలసి పోటీ చేసేటప్పుడు మీకు మీరే ముఖ్యమంత్రి అనుకోవడం హాస్యాస్పదమన్నారు. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి దొంగ అయినప్పుడు రెండు దఫాలు ఎమ్మెల్యేగా ఎందుకు గెలుపొందారో ఆలోచించాలని అన్నారు. దుర్మార్గపు శాసనసభ్యులను అసెంబ్లీకి పంపించకుండా ఉండడం కోసం రేపు జరగబోయే ఎన్నికలలో వారి మీద పోటీ చేసి చిత్తుగా ఓడించాలని డిమాండ్ చేశారు. సత్తా చూపడానికి ముందుకు రావాలన్నారు. వారిని శాశ్వతంగా రాజకీయాలనుండి తొలిగేలా చేయాలని తెలిపారు. కాపు ఉద్యమాలకు సహాయం చేసిన వారిని విమర్శించడం తగదన్నారు. "మీ ప్రసంగాలలో పదే పదే తొక్క తీస్తా, నార తీస్తా, క్రింద కూర్చోబెడతా, చెప్పుతో కొడతా, గుండు గీయిస్తా అంటున్నారు. ఇప్పటి వరకూ ఎంతమందికి తీయించి, క్రింద కూర్చోబెట్టారో, గుండ్లు ఎంతమందికి చేయించారో, ఎంతమందిని చెప్పుతో కొట్టారో సెలవివ్వాలి" అంటూ ముద్రగడ లేఖలో పేర్కొన్నారు.

# జగనన్న నవరత్నాలను దోచుకున్న నలుగురు అధికారులపై వేటు

ఏలూరు: జగనన్న నవరత్నాలను దోచుకుంటూ పట్టుబడ్డ నలుగురు ప్రభుత్వ అధికారులపై వేటు పడింది. నూజివీడు మండలంలో జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పేదలందరికి ఇళ్ళు పథకంలో భారీ స్కామ్‌కు పాల్పడిన నలుగురు గృహనిర్మాణశాఖ అధికారులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. నూజివీడు మండలం పల్లెర్లమూడి, మీర్జాపురం, దేవరగుంట గ్రామాల్లో జగనన్న ఇళ్ళను నిర్మించకుండానే బిల్లులు విడుదల చేశారు. నకిలీ లబ్ధిదారుల పేర్లను సృష్టించి గృహ నిర్మాణ సామాగ్రి సిమెంట్, స్టీల్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలించి హౌసింగ్ అధికారులు సొమ్ములు చేసుకున్నారు. సుమారుగా రూ.2 కోట్ల వరకు ప్రభుత్వ సొమ్మును కాజేసినట్టుగా సమాచారం. అవినీతికి పాల్పడిన హౌసింగ్ డీఈని ట్రాన్స్‌ఫర్ చేసిన గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు ఏఈ, వర్క్ ఇన్స్‌పెక్టర్, గౌడౌన్ ఇంచార్జ్, విలేజ్ అసిస్టెంట్ ఇంజనీర్‌లను విధుల నుంచి తొలగించింది. అలాగే ఈ స్కాంపై పూర్తి స్థాయిలో విజిలెన్స్ విచారణ చేపట్టారు. విజిలెన్స్ విచారణలో నూజివీడు నియోజకవర్గ పరిధిలో కొందరు పైస్థాయి అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే విషయం బయటకు పొక్కనివ్వకుండా రాష్ట్ర స్థాయి అధికారుల బృందం దర్యాప్తు చేపట్టింది. స్టీల్, సిమెంట్ స్కామ్ స్వాహాలో హౌసింగ్ అధికారులతో గ్రామ వైసీపీ నాయకులు చేతులు కలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పేరుతో ప్రవేశపెట్టిన జగనన్న ఇళ్ళ పథకానికి ప్రభుత్వ అధికార యంత్రాంగం, వైసీపీ నాయకులే తూట్లు పొడవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ఏపీలో నమోదైన దొంగ ఓట్లపై ఈసీకి ఎంపీ ఫిర్యాదు

ఢిల్లీ: ప్రతి ఒక్కరూ తమ ఓటు కాపాడుకోవాలని ఏపీ ప్రజలకు నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు విజ్ఞప్తి చేశారు. ఏపీలో దొంగ ఓట్లు నమోదు అవుతున్నాయని కేంద్ర ఎన్నికల సంఘానికి ఎంపీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి రాజీవ్ కుమార్‌కి లేఖ రాశారు. ఒకే ఇంటిపై అనేక దొంగ ఓట్లు నమోదు చేశారని లేఖలో పేర్కొన్నారు.

అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారని తెలిపారు. దొంగ ఓట్లకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొరకు పని చేస్తున్న వాలంటీర్లు ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొంటున్నారని, వాలంటీర్ల వ్యవస్థను ముందు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో దొంగ ఓట్లు నమోదు అయ్యాయిని రాష్ట్ర ఎన్నికల అధికారి కూడా ఒప్పుకున్నారని లేఖలో రఘురామ గుర్తుచేశారు.

## మత్తెక్కించే చూపులకు ఎలాంటివాడైనా పడిపోవాల్సిందే..!

టిక్ టాక్ డబ్ స్మాష్ వీడియోస్ తో పాపులర్ అయ్యి ఆ క్రేజ్ తో సినిమా ఛాన్స్ అందుకుంది చెన్నై చిన్నది మృణాళిని రవి. సూపర్ డీలక్స్ సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ అమ్మడు తెలుగులో గద్దలకొండ గణేష్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా హిట్ అయినా అమ్మడికి పెద్దగా అవకాశాలు రాలేదు. బిగ్ బాస్ ఫేం సోహెల్ హీరోగా నటించిన ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు సినిమాలో హీరోయిన్ గా నటించింది మృణాళిని రవి. మరోపక్క సుధీర్ బాబు మామ మశ్చీంద్ర సినిమాలో కూడా ఛాన్స్ అందుకుంది. సుధీర్ బాబు సినిమాతో అయినా అమ్మడికి లక్ కలిసి వస్తుందేమో



చూడాలి. సినిమా అవకాశాలు ఎలా ఉన్నా అమ్మడు ఫోటో షూట్స్ తో ఆడియన్స్ ని మెప్పిస్తుంది. లేటెస్ట్ గా వైట్ కలర్ షర్ట్ బ్లాక్ మిడ్డీతో అమ్మడు అదరగొట్టేసింది. తన ఓర కళ్ళతో మత్తెక్కించే చూపులకు ఎలాంటివాడైనా సరే పడిపోవాల్సిందే. అమ్మడి ఈ ఫోటో షూట్ చూసి చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే అని కామెంట్స్ పెడుతున్నారు. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను కావాలని కథల విషయంలో ఆచి తూచి అడుగులేస్తున్న మృణాళిని రవి మరీ వేగం తగ్గితే అమ్మడిని మర్చిపోయే పరిస్థితి వస్తుందని గుర్తుంచుకోవాలి. సినిమాలు చేసినా చేయకపోయి నా ఫోటో షూట్స్ తో మాత్రం తమ ఫ్యాన్స్ ని అలరిస్తుంటారు హీరో యిన్లు. వారి దారిలోనే మృణాళిని కూడా ఫోటో షూట్స్ తో కవ్విస్తుంది. టాలీవుడ్ లో వరుస సినిమాలు చేయాలని ఆసక్తి చూపిస్తున్న అమ్మడికి సరైన ఛాన్స్ లు రావట్లేదని చెప్పొచ్చు. హరీష్ శంకర్ లాంటి డైరెక్టర్ ఇంట్రడ్యూస్ చేసినా మృణాళిని రవికి మంచి ఛాన్స్ లు రావట్లేదు. మరి రాబోతున్న సుధీర్ సినిమా అయినా వర్క్ అవుట్ అవుతుందా అమ్మడి కెరీర్ లో జోష్ నింపుతుందా లేదా అన్నది చూడాలి.

## భూమిపైనే స్వర్గం చూపిస్తున్న బ్యూటీ

వింక్ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్ ఇన్ స్టా ఎలివేషన్లలో తనకు తానే పోటీ. అమ్మడు టెంప్టింగ్ ఫోజులకు కుర్రాళ్లకు మతి చెండాల్సిందే. స్కిన్ షో..క్లివేజ్ షో...థై షో ఏదైనా సరే అందులో తనదైన మార్క్ తప్పనిసరి. సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన బ్యూటీ కావడంతో తన పబ్లిసిటీ ప్లాన్ పక్కాగా ఉంటుంది. తాజాగా మరోసారి అమ్మడి అందాలు నెట్టింట దుమారం రేపుతున్నాయి. ఇదిగో ఇక్కడిలా బీచ్ రిసార్ట్ లో అగ్గి రాజేసే అందాలతో వెడెక్కిస్తుంది. జీన్స్ నిక్కర్.. వీపందం హైలైట్ అయ్యేలా డిజైన్డ్ దుస్తుల్లో మంటలు పుట్టిస్తుంది. వయ్యారంగా వెనుక వైపుగా చూస్తూ కెమెరాకి ఇచ్చిన ఫోజుకి కిక్ తప్పదు మరి. పెదాలతో పాటు కళ్లలోనూ చిన్న చిరు నవ్వును పలికిస్తుంది. ఆ సన్నని నవ్వుకు అంతే అందమైన కన్ను గీటు కూడా తోడైతే! ఆ కిక్కే వేరుగా ఉండేది. జస్ట్

మిస్ అన్ని ఒకేసారి అయితే ఎలా? అనుకుందో ఏమో! ఈసారి ఆ ఛాన్స్ తీసుకోలేదు. ఈ ఫోటోని ఉద్దేశించి ఓ బ్యూటీఫుల్ కామెంట్ పెట్టింది. భూమిపై స్వర్గం ఉంటే ఇలాగే ఉంటుందేమో. ఇది ఎంతో మనోహరమైన అనుభవం. మాటల్లో చెప్పలేని..పెదాలతో పలకలేని సంతోషంతో మనసంతా నిండిపోయింది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది. అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు గుప్పిస్తున్నారు. అసలే బ్యూటీకి సోషల్ మీడియాలో పిచ్చ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడా నెంబర్ రెట్టింపు అవ్వడం ఖాయం. ఇటీవలే చీరందంలో తళుక్కున మెరిసింది. మోడ్రన్ దుస్తుల్లో కనిపించే వారియర్ ఒక్కసారిగా చీరందంలో కనిపించేసరికి కుర్రాళ్లంతా మరోసారి ఫిదా అయ్యారు. ఆ వెంటనే ఇలా మరోసారి మోడ్రన్ గాళ్ల్ గా మారిపోయింది. కెరీర్ సంగతి చూస్తే ప్రియా వారియర్ పలు సినిమాల్లో నటిస్తోంది. ఆ సినిమా ల్లో ఈ ఏడాది ఎన్ని సినిమాలు వస్తాయి అనేది చూడాలి. మలయాళంతో పాటు ఇతర భాషల్లోనూ కొన్ని సినిమాలు చేసింది. ఈ ఏడాది అయినా హీరోయిన్ గా సక్సస్ అవుతుందా? అన్నది చూడాలి.

# సముద్రపు అడుగున ఎన్టీఆర్ రిస్క్

'జనతా గ్యారేజ్' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ – బడా డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్ లో రూపొందుతోన్న చిత్రమే 'దేవర'. పాన్ ఇండియా రేంజ్లో తెరకెక్కుతోన్న ఈ చిత్రం కోస్టల్ బ్యాగ్రౌండ్ తో రాబోతుంది. ఇందులో హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్సు ఉంటాయని చిత్ర యూనిట్ ముందే చెప్పడంతో దీని పై అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. 'దేవర' మూవీ కి సంబంధించిన రెగ్యూలర్ షూటింగ్ కొన్ని నెలల క్రితమే ప్రారంభం అయింది. అప్పటి నుంచి చిత్ర యూనిట్ వరుసగా షెడ్యూళ్లను కంప్లీట్ చేసుకుంటూ వస్తోంది.

ఇలా ఇప్పటికే మూడు మేజర్ షెడ్యూళ్లను హైదరాబాద్ లోని పలు ప్రదేశాల్లో వేసిన సెట్లలో కంప్లీట్ చేసుకున్నారు. ఈ క్రమంలోనే మరో దాన్ని కూడా మొదలు పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఎన్టీఆర్ హీరో గా కొరటాల శివ తెరకెక్కిస్తోన్న 'దేవర' మూవీ కొత్త షెడ్యూల్ను హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీలో మరికొద్ది రోజుల్లోనే మొదలు పెట్టబోతున్నారట. దీనికోసం సముద్రపు వాటర్ ను పోలి ఉండే ఓ భారీ ట్యాంక్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిసింది.

ఇందులో ఎన్టీఆర్ – సైఫ్ అలీ ఖాన్ మధ్య ఓ యాక్షన్ సీక్వెన్సు షూట్ చేయబోతున్నట్లు తాజాగా తెలిసింది. ఇక కొత్త షెడ్యూల్ లో జరగనున్న అండర్ వాటర్ ఫైట్ కోసం ఎన్టీఆర్ డూప్ లేకుండా రిస్క్ చేయబోతున్నాట. నేచురాలిటీ మిస్ అవకుండా ఉండడం కోసమే అతడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందుకే ఈ ఫైట్ సీన్ సినిమా లోని మేజర్ హైలైట్లలో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. ఇ ఈ షెడ్యూల్ దాదాపు వారం రోజుల పాటు జరగబోతుందని చిత్ర వర్గాల సమాచారం. క్రేజీ కాంబినేషన్లో రూపొందుతోన్న 'దేవర' మూవీ లో ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ నటిస్తోంది. అలాగే సైఫ్ అలీ ఖాన్ ఇందు లో విలన్ గా చేస్తున్నాడు. వీళ్లతో పాటు ఎంతో మంది ప్రముఖులు కీలక పాత్రలు చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ దీనికి సంగీతం అందిస్తున్నాడు. నందమూరి తారాక రామారావు ఆర్ట్స్ యువసుధ ఆర్ట్స్ నిర్మిస్తున్న సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్ 5వ తేదీన ఎంతో గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నారు.

# జయమాలిని..సిల్క్ స్మితని మించిపోయేలా జాన్వీకపూర్!

క్లబ్ డాన్సర్స్ గా జయమాలిని..సిల్క్ స్మిత లాంటి వారు ఎంత ఫేమస్ అయ్యారో చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరు గొప్ప నర్తకిలు. ఎంత గొప్ప డాన్సర్లో అంతకు మించి వాళ్ల ఆహార్యాలు అద్భుతంగా తెర పై పండేవి. క్లబ్ డాన్సర్ అంటే ఇలాగే ఉండాలని ఓ ట్రెండ్ సృష్టించి వెళ్లిపోయారు. ఆ తర్వాత తరం నటులు వాళ్ల లెగస్సీని అందుకోవాలని ప్రయత్నించారు గానీ ఫలించలేదు. క్లబ్ డాన్సర్స్ గా వాళ్లిద్దరికి వచ్చినంత పేరు..గుర్తింపు ఎవరికీ రాలేదు. ఆహార్యాల పరంగానూ ఎవరూ నూరుశాతం న్యాయం చేయలేదు. మరి ఆ ఛాన్స్ అతిలోక సుందరి శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్ ఏమైనా తీసుకుంటుందా? వాళ్లకి పోటీ గా నేను ఉన్నాను? అంటూ బరిలోకి దిగుతుందా? అంటే అవుననే అనేలా ఉందీ సన్నివేశం. జాన్వీ కొత్త ఫోటో ఒకటిప్పుడు ఇన్ స్టాని షేక్ చేస్తుంది. అందులో జాన్వీ అచ్చంగా క్లబ్ డాన్సర్ ఆహార్యంలోనే కనిపిస్తుంది. ఓసారి ఆ ఫోటోని పరిశీలిస్తే.. మోకాళ్ల వరకూ మెరిసే నక్షత్రాల షూస్...ఆ ఫైన థై అందాలు ఎలివేట్ అయ్యేలా స్కర్ట్..మ్యాచింగ్ బ్లౌజ్ లో అమ్మడు మిరుమిట్లు గొలుపుతున్న వైనం అచ్చంగా క్లబ్ డాన్సర్ నే తలపిస్తుంది. ఆ నడుము మడత..నాభి అందాలు..వగరైన చూపు అన్ని కొత్త జాన్వీని పరిచయం చేస్తున్నాయి. క్లబ్ డాన్సర్ మాదిరి ఇచ్చిన ఆ ఫోజులు కుర్రాళ్ల కు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో అంతార్జాలంలో కాక పుట్టిస్తుంది. జాన్వీ ఆహార్యం పై రకరకాల కామెంట్లు పడుతున్నాయి. జాన్వీ ఏ సినిమా లో నైనా క్లబ్ డాన్సర్ పాత్ర పోషిస్తుందా? లేక ! ఫ్యాషన్ ఎంపికలో భాగంగా ఇలాంటి దుస్తుల్లో దూరిపోయిందా? అంటూ కామెంట్లు పెడుతున్నారు. జాన్వీ త్వరగా క్లారిటీ ఇవ్వ. లేదంటే? ఇక్కడ క్లారిటీ మిస్ అవుతుందంటూ కుర్రాళ్ల వెర్రెత్తిపోతున్నారు. ఈ బ్యూటీ యంగ్ టైగర్ ఎన్టీఆర్ 30వ సినిమాతో టాలీవుడ్కి పరిచయమవుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే హిందీలో లాంచ్ అయింది. అక్కడ నిలదొక్కుకుంది. దీంతో సౌత్ మార్కెట్ పై కన్నేసినట్లు తెలుస్తుంది.

## కరణ్ కంపెనీలో చేరిన తెలుగు హీరోయిన్?

రాశీ ఖన్నా చాలా కాలంగా బిగ్ స్టార్ డమ్ ఆశిస్తోంది. అగ్ర కథానాయిక హోదా కోసం పాకులాడుతోంది. తెలుగు–తమిళం–హిందీలో తనవంతు ప్రయత్నాలు చేసింది. కానీ ఎందుకనో ఆశించిన స్టార్ డమ్ తన చేతికి చిక్కలేదనే చెప్పాలి. ఇక్కడ రాశీ ఖన్నా ద్వితీయ శ్రేణి హీరోల సరసన మాత్రమే నటించగలిగింది. అరుదుగా రవితేజ తప్ప పెద్ద హీరోలెవరూ అవకాశాలివ్వలేదు. అదే క్రమంలో తమిళంలో రాణించేందుకు తీవ్రంగానే శ్రమించింది. అక్కడ కొన్ని విజయాలు ఊరటనిచ్చాయి. తన స్థాయిని పెంచుకునేందుకు ఉన్న ఏ ఒక్క మార్గాన్ని రాశీ విడిచిపెట్టడం లేదు. ఇటీవలే సమంత బాటలో వెబ్ సిరీస్ లోను నటించింది. రాజ్ అండ్ డీకే అందదందలతో ఫర్జీ వెబ్ సిరీస్ లో షాహిద్ సరసన అందాల రాశీ కనిపించింది. అమెజాన్ ప్రైమ్ లో సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో నటించిన లీడ్

పాత్రలకు మంచి గుర్తింపు దక్కింది. ఇదే ఆనందంలో రాశీఖన్నా తన స్టార్ డమ్ ని మరో లెవల్ కి తీసుకెళ్లేందుకు ప్రయత్నాల్లో ఉంది. ఈ బ్యూటీ ఇప్పుడు నటవారసురాళ్లను.. పరిశ్రమ ఇన్ సైడర్స్ ని బాధ్యతగా ప్రమోట్ చేసే కరణ్ జోహార్ తో స్నేహం చేయడం హాట్ టాపిక్ గా మారింది. కరణ్ నిర్మిస్తున్న భారీ ఎపిక్ చిత్రం యోధాలో రాశీకి ఒక కీలక పాత్రలో నటిస్తోంది. ఇంత గౌరవప్రదమైన నిర్మాణ సంస్థలో బలమైన పాత్రను పోషించే అవకాశం ఇచ్చినందుకు సంతోషంగా ఉన్నానని కరణ్ విషయంలో కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేసింది. చీరకట్టు సొగసరిలా పల్లె పట్టు సుందరి లా నటించాల్సిన అవసరం లేకుండానే ...తాను ఈ సినిమాలో కనిపిస్తానని రాశీ ఖన్నా తాజా ఇంటర్వ్యూలో వెల్లడించింది. సినిమా లో అనవసరమైన గ్లామర్ ఎలివేషన్ కూడా అవసరం లేదని తెలిపింది. క్లాసిక్ ధర్మ ప్రొడక్షన్ హీరోయిన్ గా తనకు గుర్తింపు దక్కినందుకు ఆనందం వ్యక్తం చేసింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే...యోధాతో పాటు అర్మ్నణై 4 లో నటిస్తోంది. దర్శకుడు పా రంజిత్– విజయ్ చిత్రంలోను నటించనుంది.

## వైట్ అండ్ టైట్ టాపులో మిల్క్ బ్యూటీ అందాలు..!

2005లో చాంద్ సా రోషన్ చెహ్లా అనే హిందీ సినిమాతో సినీ రంగంలో అడుగు పెట్టిన మిల్క్ బ్యూటీ తమన్నా.. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయింది. అదే ఏడాది శ్రీ సినిమాతో తెలుగులో ఆ తర్వాత ఏడాది కేడీతో తమిళ ఇండస్ట్రీలోనూ అడుగు పెట్టింది. తన అందం అభినయంతో అతి తక్కువ కాలంలోనే టాప్ హీరోయిన్ గా మారిపోయింది. తన అందం అభినయం బాడీ స్ట్రక్చర్ తో తక్కువ సమయంలోనే మంచి క్రేజ్ సంపాదించుకుంది మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా. సూపర్ స్ట్రక్చర్ కళ్లు చెదిరే అందం శిల్పి చెక్కినట్లుగా ఒంపులు తిరిగిన శరీరంతో కుర్రాళ్లలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. అగ్ర హీరోల సరసన నటించి ఆహా అనిపించింది. 2005 నుంచి ఇప్పటి వరకు ఆమె ఇంకా స్టార్ హీరోయిన్ గానే కొనసాగుతోంది. అయితే తాజాగా ఈ క్యూట్ బ్యూటీ

ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఆమె ఎక్కడికో వెళ్లి వస్తుండగా.. ఎయిర్ పోర్టులో మీడియా కంట పడింది. దీంతో వెంటనే వాళ్లు ఫొటోలు తీయడం నెట్టింట షేర్ చేయడం... వైరల్ గా మారడం చకచకా జరిగిపోయాయి. అయితే తమన్నా ఈ ఫొటోల్లో బ్లాక్ జీన్స్ విత్ వైట్ టైట్ టాప్ వేసుకుంది. అందులో ఎద అందాలు చాలా క్లియర్ గా కనిపిస్తున్నాయి. వైట్ షూస్ విత్ బ్లాక్ కలర్ టాప్ ఓ స్లిమ్ హ్యాండ్ బ్యాగ్ వేసుకొని చాలా స్టైలిష్ గా కనిపిస్తోంది. ముద్దుగా ముద్ద బంతిలా నవ్వుతూ అందిరనీ మైమరిపిస్తోంది. ఈ ఫొటోలు చూసిన ప్రతీ ఒక్కరూ తమన్నా స్టైల్ కు స్మైల్ కు ఫిదా అయిపోతున్నారు. నీ అందం అదిరింది నిన్ను చూస్తేనే పిచ్చెక్కిపోతుంది ఈ అందం ఏంటమ్మడు అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇక ప్రస్తుతం తమన్నా చేతిలో ఒకటీ అర సినిమాలు తప్ప పెద్దగా అవకాశాలు రావడం లేదు. ప్రస్తుతం తెలుగులో భోళా శంకర్ సినిమాలో చిరు సరసన నటిస్తోంది. హిందీలో పలు వెబ్ సిరీస్ లు చేస్తున్నట్లు సమాచారం. తమిళంలో సూపర్ స్టార్ రజినీ కాంత్ జైలర్ సినిమాలో కూడా తమన్నాకు ఛాన్స్ వచ్చింది. తెలుగులో రీసెంట్ గా సత్యదేవ్ తో కలిసి గుర్తుందా శీతాకాలం సినిమా చేసిన తమన్నా.. ఆ తర్వాత వేరే ప్రాజెక్టులు ఒప్పుకున్నట్లు లేదు.

# 57 ఏండ్లలో గుడి, బడిని పట్టించుకోలే.. సాగునీటి గోస తీర్చలే.. మంత్రి కేటీఆర్ ధ్వజం

రాజన్న సిరిసిల్ల : ఎవడో వచ్చి నాలుగు స్పీచ్‌లు కొట్టంగానే, ఊదరగొట్టే ఉపన్యాసాలు ఇవ్వగానే ఆగమాగం మాటలు మాట్లాడగానే మనం కూడా ఆగం కావొద్దు.. ఈ రాష్ట్రం ఎవరి వల్ల బాగు పడుతుందో ఆలోచించాలి అని రాష్ట్ర మంత్రి కేటీఆర్ సూచించారు. 57 ఏండ్లలో గుడిని, బడిని పట్టించుకోలేదు.. సాగునీటి గోస తీర్చలేదు కానీ.. ఇప్పుడు వచ్చి ఏదేదో మాట్లాడుతున్నారని ప్రతిపక్షాలపై కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎల్లారెడ్డిపేటలో రూ. 8.5 కోట్లతో అభివృద్ధి చేసిన విద్యా క్యాంపస్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

మనం ఖర్చు చేసే ప్రతి పైసాను సమగ్రంగా ఆలోచించి ఖర్చు పెట్టాలి అని కేటీఆర్ సూచించారు. ప్రజలకు అవసరమైన వాటిని తప్పకుండా చేయాలి. మా కంటే ముందున్న ప్రభుత్వాలు ఏం చేశాయి..? ఒక బడిని బాగు చేద్దామన్న ఆలోచన లేదు.. కానీ ఇప్పుడొచ్చి పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. బడిని, గుడిని పట్టించుకోలేదు. కరెంట్, సాగు నీళ్లు ఇవ్వలేదు. ఎవడో చెప్పిండని కాదు.. మన ప్రణాళిక ప్రకారం పని చేయాలి. అయిన పనుల గురించి మాట్లాడటం లేదు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్‌కు అర పైసానైనా సాయం చేసిండా..? ఒక్క నవోదయ పాఠశాలనైనా వచ్చిందా..? కస్తూర్బా కాలేజీ వచ్చిందా..? మెడికల్ కాలేజీ రాదు.. నర్సింగ్ కాలేజీ ఇవ్వరు. మళ్లీ సిగ్గు లేకుండా డిగ్రీ కాలేజీ ఇవ్వాలని మాట్లాడుతారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**బరాబర్ ఎల్లారెడ్డిపేటకు డిగ్రీ కాలేజీ వస్తది :** బరాబర్ ఎల్లారెడ్డిపేటకు డిగ్రీ కాలేజీ వస్తది అని కేటీఆర్ తేల్చిచెప్పారు. కానీ నువ్వేవడో ఆందోళన చేసినందుకు కాదు. ఎల్లారెడ్డిపేట ప్రజల మీద ప్రేమతోని కేసీఆర్ డిగ్రీ కాలేజీ ఇస్తారు. కార్లకు అడ్డపడటం, ధర్నాలు చేయడం కాదు.. చేతనైతే, దమ్ముంటే.. కేంద్రం నుంచి ఓ రెండు కాలేజీలు, ఓ రెండు పరిశ్రమలు తీసుకురావాలి. సిరిసిల్ల నేతన్నల కోసం ఒక మెగా పవర్‌లూమ్ క్లస్టర్ తీసుకురావాలి. కరీంనగర్‌లో ఒక ట్రిపుల్ ఐటీ తీసుకురా..? అలా విద్యలో పోటీ పడాలని బీజేపీ నేతలకు కేటీఆర్ సవాల్ విసిరారు.

**పలకతో వచ్చి.. పట్టాతో వెళ్లాలి..** పలకతో వచ్చి పట్టాతో వెళ్లాలనే ఉద్దేశంతో గంభీరావుపేటలో కేజీ టు పీజీ క్యాంపస్ ఏర్పాటు చేశాం అని కేటీఆర్ గుర్తు చేశారు. 3 దశల్లో 510 ప్రభుత్వ పాఠశాలల్లో 12 మౌలిక సదుపాయాల, వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. రాజన్న సిరిసిల్ల పరిధిలో %--% 60 పాఠశాలల్లో 22 వేల మంది విద్యార్థులకు కంప్యూటర్ చాంప్స్ పేరుతో బేసిక్ కంప్యూటర్ పరిజ్ఞానం అందిస్తున్నాం అని తెలిపారు. రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ పాఠశాలలను టీ ఫైబర్‌తో అనుసంధానం చేయనున్నామని చెప్పారు.

**అనేక అంశాల్లో సిరిసిల్ల నంబర్ వన్ :** సిరిసిల్ల ఇప్పటికే అనేక అంశాల్లో దేశంలోనే ముందుంది అని కేటీఆర్ తెలిపారు. దేశంలో విద్య విషయంలో బెస్ట్ స్కూల్ ఎక్కడా ఉన్నాయంటే సిరిసిల్ల అనే పేరు రావాలన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మానవ సంబంధాలు, జీవ కారుణ్యంపై అవగాహన పెంపొందించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదులో మండలాలు, ప్రజా ప్రతినిధులు పోటీ పడాలి. రాజన్న సిరిసిల్ల జిల్లాను విద్యా ప్రమాణాలలో దేశంలోనే ఆదర్శంగా నిలపాలని కేటీఆర్ సూచించారు.

## మరోసారి ఎమ్మెల్యే రాజయ్యపై సర్పంచ్ నవ్య సంచలన ఆరోపణలు

వరంగల్: స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై సర్పంచ్ నవ్య మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. తనవద్ద ఉన్నా ఆడియో రికార్డ్‌లు ఇవ్వాలని ఆయన అనుచరులతో ఒత్తిడి చేయిస్తున్నారని సర్పంచ్ నవ్య ఆరోపించారు. అప్పట్లో చేసిన లైంగిక ఆరోపణలకు సంబంధించిన టేపులు ఇవ్వాలని ఎమ్మెల్యే ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తనకు తన భర్తకు మధ్య చిచ్చు పెట్టి ఎమ్మెల్యే రాజయ్య పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజయ్య చేసిన లైంగిక ఆరోపణల టేపులు ఏబీఎన్ వేదికగా బయటపెడతానని నవ్య వెల్లడించారు. ఇరవై లక్షలు ఇస్తా కాంప్రమైజ్ కావాలని తన మధ్య వర్తులతో ఒత్తిడి చేస్తున్నారని నవ్య ఆరోపణలు చేశారు. తన భర్తతో సహా ఎమ్మెల్యే రాజయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదని మరోసారి ఫిర్యాదు చేస్తానని నవ్య తెలిపారు. ఇదిలావుండగా... తెలంగాణ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై మహిళా సర్పంచ్ లైంగిక ఆరోపణలు తీవ్ర దుమారం లేపిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే రాజయ్య తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ హన్మకొండ జిల్లా జానకీపురం సర్పంచ్ నవ్య సంచలన ఆరోపణలు చేసింది. మాట వినందుకు తనపై రాజయ్య లైంగిక వేధింపులకు దిగుతున్నారని నవ్య పేర్కొంది. తనకు ఎమ్మెల్యే కాల్ చేసి బయటకు రమ్మంటున్నారని.. నీ మీద కోరికతోనే పార్టీ టికెట్ ఇచ్చానని వేధిస్తున్నాడని నవ్య ఆరోపించారు. మరోవైపు నవ్య తనపై చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే రాజయ్య ఖండించారు.

## రాజకీయ పబ్బం గడుపుకునేందుకే తనపై ఆరోపణలు : మంత్రి గంగుల

కరీంనగర్ : బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ రాజకీయ పబ్బం గడుపుకునేందుకు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్ గ్రంథాలయంలో మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లపై కూడా అసత్యపు ఆరోపణలు చేసినా నాయకులు నేడు బీసీలకు అందించే లక్షా ఆర్థిక సహాయంపై కూడా అబద్దాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అర్హులైన బీసీలందరికీ విడతల వారీగా సహాయం చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ వద్దు అన్న పార్టీలు కూడా ఇప్పుడు తెలంగాణ గురించి మాట్లాడుతున్నాయని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఓట్లకోసం గ్రామాల వెంట పడుతున్నారని విమర్శించారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విలువ మున్సిపల్ ఎన్నికల్లోనే బయట పడ్డదని, కనీసం ఒక్క కార్పొరేటర్‌ను కూడా గెలిపించుకోలేక పోయారని ఎద్దేవా చేశారు. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలు తన మీద విచారణ చేసినా ఏమీ తేలలేదని అన్నారు. ఎన్నికల్లో ఎంఐఎం మాత్రమే కాదు కేఏ పాల్, షర్మిల కూడా పోటీ చేయొచ్చని అన్నారు. తన జోలికి వస్తే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

## దేశంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి మరణ శాసనమే : బీవీ రాఘవులు

మిర్యాలగూడ : 2024లో జరగబోయే సాధారణ ఎన్నికల్లో మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం కనుమరుగవుతుందని, వాటిని రక్షించేవాళ్లు ఏకతాటిపైకి రావాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎన్నికల సన్నాహాలు జరుగుతున్నాయని, అన్ని పార్టీలు ఎన్నికల ప్రచారం ప్రారంభించాయని రాఘవులు తెలిపారు. 2024లో బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే రాజ్యాంగం మరణ శాసనంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ విధానాలను వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక వేదికపైకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని, అందులో భాగంగానే ఈ నెల 23న బీహార్‌లో ప్రతిపక్ష పార్టీల సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి సీపీఎం పార్టీ హాజరవుతుందని, తెలంగాణ నుంచి సీఎం కేసీఆర్ కూడా రావాలని ఆయన కోరారు. తమకు కూడా కేరళలో కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థిగా ఉందని, అయినప్పటికీ బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ముందుకెళ్తున్నామని చెప్పారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశంలో మోదీ ప్రభుత్వం ప్రమాదకరమైన చట్టాలను తీసుకురాబోతుందన్నారు. ఢిల్లీలో తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక ఆర్డినెన్స్‌ను అన్ని పార్టీలు ఖండించాయని, ఫెడరల్ వ్యవస్థను బలపరచాలనే లక్ష్యం ఉన్న వారందరూ ఆ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించాలని కోరారు. యూనిఫాం సివిల్ కోడ్‌ను బలవంతంగా దేశంపై రుద్దేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. దీనివల్ల ప్రజల మధ్య విభజన సృష్టించి మత విద్వేషాలతో రాజకీయాలు చేయాలని చూస్తున్నదని పేర్కొన్నారు. దీన్ని ప్రజాస్వామ్యవాదులందరూ వ్యతిరేకించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తీగల సాగర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## విచారణకు రావాలంటూ బీఆర్ఎస్ నేతలకు ఐటీ నోటీసులు

హైదరాబాద్ : ఐటీ విచారణకు రావాలంటూ బీఆర్ఎస్ నేతలకు నోటీసులు అందాయి. 84 గంటల పాటు పైళ్ల శేఖర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లోనూ ఐటీ ముమ్మర తనిఖీలు నిర్వహించింది. సోదాల్లో స్వాధీనం చేసుకున్న పలు డాక్యుమెంట్స్, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్స్ ఆధారంగా పైళ్ల శేఖర్‌రెడ్డికి ఐటీ నోటీసులు జారీ చేసింది. నేడు సంబంధిత వివరాలు, ఆధారాలతో హైదరాబాద్‌లోని ఐటీ ఆఫీస్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో ఐటీ అధికారులు పేర్కొన్నారు. శేఖర్‌రెడ్డితోపాటు జనార్దన్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి కూడా నోటీసులు ఇచ్చినట్టు సమాచారం. అయితే నేడు ఐటీ ముందు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరు కానున్నారు. మర్రి జనార్దన్ రెడ్డి సమయం కోరనున్నారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డిని గురువారం హాజరు కావాలని ఐటీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. అధికార బీఆర్ఎస్ పార్టీ నేతలను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారులు హడలెత్తించారు. 50 బృందాలుగా ఏర్పడిన అధికారులు ఏకకాలంలో బీఆర్ఎస్ ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, మరో నాయకుడి ఇళ్లలో సోదాలు చేశారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ నాయకుడు కొండపల్లి మాధవ్ (ఈయన 20 ఏళ్లు బీజేపీలో ఉన్నారు) ఇళ్లలో దాడులు చేశారు. ఆదాయ పన్ను లెక్కల్లో తేడాలుండడంతోనే ఈ సోదాలు చేసినట్లు సమాచారం. అయితే ఒకేసారి ముగ్గురు నేతల ఇళ్లలో ఐటీ దాడులు జరగడంతో బీఆర్ఎస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల కిందట కూడా బీఆర్ఎస్ నేతలకు ఐటీ అధికారులు షాక్ ఇచ్చారు. అప్పుడు కొందరు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. సోదాలు పెద్దఎత్తున జరగకపోయినప్పటికీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆందోళన చెందారు. తిరిగి వారం క్రితం ఏకకాలంలో ఒక ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేలు, మరో నేత ఇళ్లు, సంస్థల్లో సోదాలు చేపట్టడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో విషాదం

హనుమకొండ: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో విషాదం చోటు చేసుకుంది. జిల్లాలోని కమలాపూర్ మండలం మర్పెల్లిగూడెంలో విద్యార్థులతో ర్యాలీ తీస్తుండగా ట్రాక్టర్ కింద పడి 6వ తరగతి విద్యార్థి ఇనుగాల ధనుష్(10) దుర్మరణం చెందాడు. ర్యాలీ తీస్తుండగా కిరాణం దుకాణంలోకి వెళ్లి బిస్కెట్ ప్యాకెట్ తెచ్చుకుంటుండగా వెంటపడ్డ కుక్కలను తప్పించుకునే ప్రయత్నంలో విద్యార్థి ట్రాక్టర్ కింద పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రాథమిక పాఠశాలలో 5 వ తరగతి పూర్తి చేసిన ధనుష్... ఈ విద్యా సంవత్సరం 6వ తరగతిలో ప్రవేశం కోసం హైస్కూల్‌కు వెళ్లాడు. ఇంతలోనే విద్యా పండుగ వేడుకల్లో భాగంగా ర్యాలీ తీస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

ఎంతో హుషారుగా స్కూలుకు వెళ్లిన చిన్నారి విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు జయపాల్, స్వప్న కన్నీరుమున్నీరుగా

విలపిస్తున్నారు. పాఠశాల నిర్వహకుల నిర్లక్ష్యమే విద్యార్థుల ప్రాణం తీసిందని గ్రామస్తులు అంటున్నారు. పాఠశాల నిర్వాహకులు, అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రాగల మూడు రోజుల్లో తెలంగాణకు వర్షసూచన..!

రాగల మూడు రోజుల్లో తెలంగాణలో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో వడగాలు వీస్తాయని తెలిపింది.

అదే సమయంలో భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే బుధవారం నుంచి శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు

ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా నైరుతి రుతుపవనాలు ఏపీలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. రాబోయే రెండు, మూడు రోజుల్లో దక్షిణభారతదేశమంతా విస్తరించే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ వివరించింది.

## అంగరంగ వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవం

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతున్నది. ఇవాళ ఉదయం 9.30 గంటలకు ఈ కల్యాణోత్సవం ప్రారంభమైంది. ఎల్లమ్మ అమ్మవారి కల్యాణాన్ని ప్రజలు టీవీల్లో వీక్షించేలా ప్రత్యక్ష ప్రసారం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకునేలా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏటా ఆషాడ మాసం మొదటి మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతుంది. కల్యాణానికి ప్రభుత్వం తరఫున మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబసమేతంగా హాజరై పట్టువస్త్రాలు సమర్పించారు. కాగా, అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా భక్తులు భారీగా కల్యాణోత్సవానికి విచ్చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే, బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఘనంగా ఎదుర్కోళ్లు నిర్వహించారు.

ఇవాళ అంగరంగ వైభవంగా ఎల్లమ్మ కల్యాణం చేస్తున్నారు. చివరిగా రేపు సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. అంతటితో అమ్మవారి కల్యాణోత్సవాలు ముగుస్తాయి.

## ప్రజల ప్రాణాలు తీసేందుకేనా ఈ ఉత్సవాలు?.. బీఆర్ఎస్ సర్కార్‌పై బండి సంజయ్

హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో ఆరవ తరగతి విద్యార్థి ట్రాక్టర్ కింద పడి దుర్మరణం చెందిన ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ స్పందించారు. ప్రజల ఉసురు పోసుకునేందుకే బీఆర్ఎస్ సర్కార్ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందా అంటూ మండిపడ్డారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ట్విట్టర్ వేదికగా బండి సంజయ్ స్పందిస్తూ... "తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో కమలాపూర్ మండలం మర్పెల్లిగూడెంలో 6వ తరగతి విద్యార్థి ఇనుగాల ధనుష్ దుర్మరణం దిగ్భ్రాంతికరం. బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపం, సానుభూతి వ్యక్తం చేస్తున్నాను. స్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థిని దశాబ్ది ఉత్సవాలకు తీసుకొచ్చిన ప్రభుత్వమే ఈ మృతికి బాధ్యత వహించాలి. తక్షణమే బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలి. ప్రజల ఉసురు పోసుకునేందుకే బీఆర్ఎస్ సర్కార్ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందా? ఈ ఉత్సవాల్లో పాల్గొనేలా ప్రభుత్వ యంత్రాగంపై ఒత్తిడి తెస్తున్న ఈ సర్కార్.. విద్యార్థులను కూడా బలవంత పెట్టడం దారుణం. ఉజ్జ్వల భవిష్యత్తు ఉన్న చిన్నారి విగతజీవిగా మారడానికి కారణమెవరు? ఆ తల్లిదండ్రుల బాధను ఎవరు తీరుస్తారు? ఏం చెప్పి వారిని ఓదారుస్తారు..?. గతంలో ఖమ్మం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాల్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకొని కొందరు మృతి చెందారు.. వనపర్తి జిల్లాలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కళ్యాణలక్ష్మీ చెక్కు తీసుకునేందుకు వచ్చిన మరో వృద్ధురాలిని రోజంతా నీరీక్షించేలా చేయించి ఆమె మృతికి కారణమయ్యారు.. ఇప్పుడు దశాబ్ది ఉత్సవాల్లో 6వ తరగతి చిన్నారి దుర్మరణం పాలయ్యాడు.. ప్రజల ప్రాణాలు తీసేందుకే మీ సమ్మేళనాలు, ఉత్సవాలు, వేడుకలా..?" అంటూ బండి సంజయ్ ట్వీట్ చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com